ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 126, పేజీలు - 08

శుక్రవారం, నవంబర్ 6, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మంత్రివర్గం ఆమోదం
- నవంబర్ 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు
- నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జయంతి సభ..
- చీరల పంపిణీ ప్రారంభం
- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు..
-అగ్నిమాపక చట్ట సవరణకు ఆమోదం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించాలని రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించింది. ఈ పథకం అమలులో భాగంగా నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశ వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరితో కలిసి మీడియాకు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో పాల్గొననున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి పండుగ వేడుకలు జరుపుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.

2లో..

ప్రధానికి అధికారికంగా

లేఖ రాయండి

– రాహుల్‌కు అమిత్ షా సవాల్

- ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చకు రెడీ
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తాం
- రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరిగితే సరిపోదు
- ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. నిజంగానే చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై

2లో..

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ దందా

- స్క్వేర్ ఫీటుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్
- విమర్శలు సరే, కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు
- బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు

2లో..

ఎన్నికల ప్రక్రియ మొత్తం కబ్జా

- రిగ్గింగ్ దే విజయమన్న జగన్



అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక ఎన్నికల నిర్వహణ పైన మాజీ సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు చేసారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ కబ్జా చేసారని ఆరోపించారు. నామినేషన్ల పర్వం నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతీ దశ లోనూ అక్రమాలకు పాల్పడ్డారని

2లో..

ముగిసిన 'పరిషత్' ఎన్నికల పోలింగ్

- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిన ప్రక్రియ - ప్రాథమిక అంచనాల ప్రకారం 65--68% పోలింగ్ నమోదు
- నవంబర్ 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమరం ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఐదు గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఈ ఓటింగ్ జరిగింది. ఉదయం నుంచి వాతావరణం అనుకూలించక పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, మధ్యాహ్నం వరకు నెమ్మదించిన ఓటింగ్ శాతం తర్వాత ఊపందుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు అధికారిక ప్రకటన వెలువడే సమయానికి గ్రామీణ ఏపీ వ్యాప్తంగా సుమారు 65% నుంచి 68% మధ్య పోలింగ్ నమోదై ఉంటుందని ప్రాథమిక సమాచారం ఆధారంగా అంచనా వేస్తున్నారు. ఉదయం 11 గంటల సమయానికి 21.12% గా ఉన్న పోలింగ్ శాతం,

2లో..

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై కవిత ఫైర్

– రేవంత్ సర్కారు నెల రోజుల డెడ్ లైన్

- అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సర్వేకు కవిత డిమాండ్
- కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ
- సీఎం సోదరులే డబ్బులు దండుకుంటున్నారని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ లోని ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గ్రౌండ్ వాటర్ లేని ఆ ప్రాంతంలో ఒక్క ఇటుక కూడా పేర్చవద్దని హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ దగ్గరుండి పర్మిషన్లు ఇప్పిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నగర ప్రజలు సరైన రోడ్లు, నీళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యలను పట్టించుకోకుండా అక్రమ సంపాదనపైనే దృష్టి పెట్టారన్నారు.

2లో..

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

- ప్రజాతీర్పు తారుమారుకు కుట్రలన్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శించింది. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును సైతం గౌరవించకుండా, తమకు అనుకూలంగా ఫలితాలను మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గోకుల్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని దుయ్యబట్టింది. ఎన్నికలు

2లో..

ఫుట్‌బాల్‌కు క్రిస్టియానో

రొనాల్డో గుడ్‌బై

- 23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు



2లో..

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే

– ప్రవళిక మృతితో ఆర్టీసీ కీలక నిర్ణయం

- ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్టీసీ
- డోర్లు మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశాలు
- డోర్లు లేని బస్సులకు వెంటనే తలుపులు ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులు, సిబ్బంది భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి ఘటన నేపథ్యంలో కదులుతున్న బస్సుల్లో డోర్లు తప్పనిసరిగా మూసి ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు ఆర్టీసీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అన్ని డిప్యూటీ రీజినల్ మేనేజర్లకు సూచనలు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 25న జరిగిన విషాద ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. మణుగూరు ఆర్టీసీ డిపోకు

2లో..

వాతావరణ మార్పులపై సమరశంఖం

- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

- డిసెంబర్ 8న తెలంగాణ వాతావరణ సదస్సు
- 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, నిపుణుల భాగస్వామ్యం
- కరువు నివారణకు తక్షణ, దీర్ఘకాలిక కార్యాచరణపై చర్చలు
- ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఆరు ప్రదర్శనశాలలు
- 49 సంస్థలతో రక్షణ రంగ ప్రదర్శన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్‌నినో ప్రభావం మారుతున్న వాతావరణ పరిస్థితులు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కరువు సవాళ్లు వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతోంది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడంతోపాటు, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించే లక్ష్యంతో డిసెంబర్ 8న తెలంగాణ వాతావరణ సదస్సును

3లో..

మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు

- ఆసియా గేమ్స్ పారా అథ్లెట్లపై ప్రధాని మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్ 2026లో భారత పారా అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పారా గేమ్స్‌లో మన అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శన, ప్రపంచ క్రీడల్లో భారతదేశం ఒక ప్రధాన శక్తిగా ఎదుగుతోందనడానికి ఒక నిదర్శనమని కొనియాడారు. 2010లో ఒక స్వర్ణంతో సహా 14 పతకాలను సాధించిన భారత్, ఈ ఏడాది ఏకంగా 114 పతకాలను సాధించిందని, ఈ ఘనతకు అథ్లెట్ల అంకితభావం,

2లో..

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై కవిత ఫైర్

అయ్యప్ప సోసైటీలో జరుగుతున్న అక్రమాలకు సంబంధించి గురువారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సోసైటీలోని గురుకుల ట్రస్ట్ కు సంబంధించిన భూముల్లో అక్రమంగా 500 నుంచి 700 వందల అక్రమ నిర్మాణాలు వచ్చాయన్నారు. వారందరికీ ముఖ్యమంత్రి సోదరులే పర్మిషన్లు ఇప్పిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సమయానికి కూడా అక్కడ కొత్తగా 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు.సోసైటీకి చెందిన ఈ భూముల్లో రిజిస్ట్రేషన్ కు అవకాశం లేకపోవటంతో నోటరీల ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. అక్రమంగా పది అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తున్నారని.. పెద్ద ఎత్తున వాటిల్లో పీజీ హాస్టల్స్, కాలేజ్ లను నడుపుతున్నారని చెప్పారు. ఒక్కో భవనానికి మధ్యలో కనీసం అగరు బత్తి పట్టేంత సందు కూడా ఉండటం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిదీ బాధ్యత అని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతుంటే ఎందుకు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవటం లేదో చెప్పాలని నిలదీశారు. ఎవరి ఒత్తిడి కారణంగా ఈ అక్రమాలను చూసి చూడనట్లు వదిలేస్తున్నారంటూ ప్రశ్నించారు. ఈ అక్రమాలపై ఏ రాజకీయ పార్టీ కూడా ఎందుకు మాట్లాడటం లేదని కవిత అడిగారు. కానీ తాము మాత్రం ఈ విషయాన్ని వదిలిపెట్టమని చెప్పారు.అయ్యప్ప సోసైటీలోని ఖానామెట్ ప్రాంతంలో పూర్తిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కవిత చెప్పారు. ముఖ్యమంత్రి ఇంటికి సమీపంలో ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలను జియో ట్యాగ్ ద్వారా ఓ న్యూస్ పేపర్ వాళ్లు రాస్తే కూడా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. ఇక్కడి అక్రమాలపై కథనాలు ప్రసారం చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను ఇంటి ఓనర్లు బెదిరిస్తున్నారని చెప్పారు. మీడియానే బెదిరిస్తూ మా వెనుక పెద్దలు ఉన్నారని వాళ్లు చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి సోదరుల అండతోనే మీడియాను బెదిరిస్తున్నారని.. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ రౌడీ రాజ్యాన్ని నడుపుతోందని విమర్శించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రే పెద్ద పెద్ద బిల్డర్లకు సహకరిస్తున్నారని చెప్పారు. మూసీ గర్భంలో నిర్మాణాలు చేపట్టిన ఆదిత్య బిల్డర్స్ కు అదే మూసీలో మరో మూడు ప్రాజెక్ట్ లు చేపట్టిన పట్టించుకోవటం లేదన్నారు. మూసీలో ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలకు వ్యతిరేకంగా తాము ధర్నా చేసిన తర్వాత మూడు ప్రాజెక్ట్ లు కొత్తగా అదే మూసీలో నిర్మిస్తున్నారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆదిత్య బిల్డర్స్ వాళ్లు ముఖ్యమంత్రి ఇద్దరు సోదరులకు చెరొక విల్లా ఇవ్వటంతోనే వారికి పర్మిషన్లు ఇచ్చారన్నారు. ఈ విధంగా అడ్డదిడ్డంగా దోచుకుంటున్న వారిని ప్రకృతి కూడా క్షమించదని హెచ్చరించారు. అయ్యప్ప సోసైటీలో ఇటుక కూడా పేర్చవద్దని హైకోర్టు ఆర్డర్ ఉందని కవిత చెప్పారు. అయిన సరే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా కొత్తగా 7 వందల నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిందన్నారు. పైగా నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. ఇవి చెల్లవని, ఇక్కడ భూములు, ఫ్లాట్లు కొనవద్దని ప్రజలకు సూచించారు. అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్న వాళ్లు, నోటరీ తో రిజిస్ట్రేషన్ చేస్తున్న వాళ్లు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. అయ్యప్ప సోసైటీలో సమగ్ర సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి నెల సమయం ఇస్తున్నామని..ఈ లోపు చర్యలు తీసుకోకపోతే తామే అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి రెడ్ మార్క్ వేస్తామన్నారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యుల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లో సాగనివ్వమని చెప్పారు.రాష్ట్రంలో ఆర్టీఐ ఉండి ప్రయోజనం లేకుండా పోయిందని కవిత అన్నారు. ఏ దరఖాస్తుకు సమాచారం ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తంగా 18 వేల అర్జీలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఒత్తిడి వస్తే ఒక్క జిల్లాలోనే ఒక్క రోజులో 8 వందల అప్లికేషన్లకు సమాధానం ఇవ్వలేమని చేతులెత్తేశారన్నారు. అలాంటప్పుడు ఆర్టీఐ ఉండి ఏం లాభమని ప్రశ్నించారు. అయ్యప్ప సోసైటీకి సంబంధించి సమాచారం కోసం తాను అప్లికేషన్ పెడతానని వెంటనే సమాధానం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 320 మండలాలు కరువులో ఉంటే హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి అమిత్ షా పైసా సాయం ప్రకటించలేదని కవిత మండిపడ్డారు. కాంగ్రెస్ ఢిల్లీలో ధర్నా చేస్తే హైదరాబాద్ వచ్చి అమిత్ షా కౌంటర్ రాజకీయాలు చేశారే తప్ప తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. పైగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుస్తామంటూ ఆ పార్టీ నాయకులు బీరాలు పోతున్నారని విమర్శించారు. నగరానికి ఏమీ చేయని బీజేపీ నాయకులు నీళ్లు లేని బావిలో దూకాలన్నారు. దేశంలో 13 కోట్ల మంది విదేశీయులున్నారంటూ అమిత్ షా పచ్చి అబద్దాలు చెబుతున్నారన్నారు. 13 కోట్ల మంది విదేశీయులుంటే బీజేపీ రెండుసార్లు విదేశీయులు వేసిన ఓట్లతోనే గెలిచిందా చెప్పాలని నిలదీశారు. ఇలాంటి అబద్దాలు చెప్పి ఎన్ని రోజులు ప్రజలను మోసం చేస్తారంటూ విమర్శించారు. తన వద్ద ఇంచు అసైన్డ్, ఇనాం భూములు ఉన్న సరే ప్రభుత్వానికే రాసిస్తా అని కవిత చెప్పారు. తన భూములకు సంబంధించి ఎలాంటి విచారణకైనా సిద్ధమన్నారు. రాష్ట్రంలో ప్రజలు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారని.. దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఓ వైపు రైతులను పంటలు వేయవద్దని చెబుతుంటే మంత్రి తుమ్మల మాత్రం మేము అలా చెప్పలేదంటున్నారన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రి మధ్య సయోధ్య లేకపోవటం కారణంగా రైతులు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు.గోదావరి, కృష్ణాలో నీటిని ఎత్తిపోసే అవకాశాన్ని వదిలేసి ఇప్పుడు నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి చేతులెత్తేశారని విమర్శించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున మహిళ ఓటర్లు ఓటు నమోదు చేసుకోని తమకు అండగా ఉండాలన్నారు. టీఆర్ఎస్ పార్టీ మహిళల కోసం మహిళల చేత నడుపుతున్న పార్టీ అని ఈ పార్టీకి మీ అండ ఉండాలని మహిళ గ్రాడ్యుయేట్లను కవిత కోరారు.

ఎన్నికల ప్రక్రియ మొత్తం కబ్జా

విమర్శించారు. ఎన్నికల సంఘం పోలీసులు సైతం ప్రభుత్వాని కి మద్దతుగా నిలిచి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసారని వ్యాఖ్యానించారు. తాము న్యాయ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తరువాత ఓట్ల సంఖ్య ఎలా పెరిగిందని జగన్ ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచే సత్తా లేక చంద్రబాబు అక్రమాలు చేసారని మండిపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాల ద్వారా సీఎం చంద్ర బాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శకుని మాయా పాచికల్లా ఎన్నికల ప్రక్రియను రిగ్ చేశారని, అధికార దుర్వినియోగం, రౌడీయిజంతో ఎన్నికల వ్యవస్థను తమ గుప్పిట్లోకి తీసుకున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, 143 హామీలపై ప్రజలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని జగన్ ఆరోపించారు.వేలాది మంది వసీపీ కార్యకర్తలను బైండోవర్ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరించారని, అరెస్టులు చేశారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలతో పోలీసులు కుమ్మక్కై తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని అన్నారు. స్క్రూటినీ పేరుతో పత్రాలు మాయం చేయడం, సంతకాలు ఫోర్జరీ చేయడం, నామినేషన్లను తిరస్కరించడం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారని జగన్ ఆరోపించారు. పులివెందులలో 40 వార్డులకు గాను 20 వార్డుల్లో మాత్రమే తమ అభ్యర్థులు నామినేషన్లు వేయగలిగారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తరహా దౌర్జన్యం కొనసాగిందని, 84 జెడ్పీటీసీ, 2,109 ఎంపీటీసీ స్థానాల్లో నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారని ఆరోపించారు. అభ్యర్థులను అరెస్ట్ చేయడం, పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నామినేషన్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని జగన్ ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల్లో 11,378 పోలింగ్ కేంద్రాలకు గాను 5,737 కేంద్రాల్లో మాత్రమే, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో 31,460 కేంద్రాలకు గాను 16,064 కేంద్రాల్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని తెలిపారు. నామినేషన్ల నుంచి ఫలితాల వరకు ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నామినేషన్లు, స్క్రూటినీ, పోలింగ్ బూత్‌లు, పోలింగ్ శాతం, రాత్రిపూట బ్యాలెట్ బాక్సుల నిర్వహణ వరకు అన్ని దశల్లోనూ రిగ్గింగ్ జరిగిందని విమర్శించారు.పోలింగ్ బూత్‌లలో అక్రమాలు జరుగుతున్నా పోలీసులు అడ్డుకోకుండా సహకరించారని జగన్ ఆరోపించారు.

ముగిసిన 'పరిషత్' ఎన్నికల పోలింగ్

మధ్యాహ్నం 1 గంట దాటేసరికి 35% నుండి 50% వరకు పెరిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గ్రామీణ ఓటర్లు బూత్‌ల వైపు అడుగులు వేశారు. ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలైన మార్కాపురం , తిరుపతి, బాపట్ల, ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అత్యధికంగా ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. వర్షం ప్రభావిత తీరప్రాంతాలు, కొండప్రాంతాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి చోట్ల ఓటింగ్ శాతం కాస్త తక్కువగా రికార్డయింది. గ్రామీణ ప్రాంతాల్లో తమ సొంత నేతలను ఎన్నుకోవాలనే కుతూహలంతో ఓటర్లు తరలిరావడం పోలింగ్ శాతం పెరగడానికి కారణమైంది.అయితే, ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ప్రశాంతంగా సాగలేదు. పలు జిల్లాల్లో అధికార ఎన్డీయే కూటమి , విపక్ష వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని పలు కేంద్రాల్లో రిగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డాయి. పొలిటికల్ ప్రాబల్యం చూపించేందుకు జరిగిన ప్రయత్నాలలో కొన్ని బూత్‌ల వద్ద ఉద్రిక్తతలు చోటుచేసుకోగా, పోలీసులు లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.పోలింగ్ ముగియడంతో 31,460 పోలింగ్ కేంద్రాలలో ఉన్న బ్యాలెట్ పెట్టెలకు అధికారులు ఏజెంట్ల సమక్షంలో పకడ్బందీగా సీళ్ళు వేశారు. ఈ బ్యాలెట్ బాక్సులను రెవెన్యూ, పోలీస్ నిఘా నీడలో సాయంత్రానికి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన విజువల్స్‌ను విశ్లేషిస్తోంది. ఎక్కడైనా బ్యాలెట్ పేపర్లు చిరగడం, బాక్సులు ధ్వంసం కావడం లేదా ఘర్షణల వల్ల పోలింగ్ పూర్తిగా నిలిచిపోయిన స్థానాలు ఉంటే, శుక్రవారం నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉందని ఎస్ఈసీ వర్గాలు తెలిపాయి.ఇటీవలే ముగిసిన పురపాలక పోరులో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించిన వేళ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ పార్టీ జెండా ఎగురుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ పోలింగ్ ప్రక్రియ అంతా ముగియడంతో అందరి దృష్టి నవంబర్ 7న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే నెలకొంది. ఆ రోజే జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల జాతకాలు తేలనున్నాయి. ఆ తర్వాత నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు జరగనున్నాయి.

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ దందా

అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటించారు. 'లోక్‌తంత్ర బచావో, అరాచకత హటావో' మహాపాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఒక ఏటీఎంగా వాడుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలో ప్రస్తుతం 'ఆర్ఆర్ ట్యాక్స్' దందా నడుస్తోందని అమిత్ షా విమర్శించారు. ఆ ఆర్ఆర్ ట్యాక్స్ అంటే కేవలం రేవంత్ రెడ్డి ట్యాక్స్ మాత్రమే కాదని, ఇక్కడ వసూలు చేస్తున్న ఆ డబ్బులను ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చేరుస్తున్నారని, అందుకే అది 'రాహుల్-రేవంత్ ట్యాక్స్' అని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ప్రతిచోటా అవినీతే రాజ్యమేలుతోందని ఘాటు విమర్శలు చేశారు.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

పూర్తయి ఫలితాలు వెలువడిన తర్వాత, పాలకవర్గంలో మెజారిటీని సాధించేందుకు నిబంధనలను మార్చాలని మహాయుతి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ మేరకు గురువారం తన సామాజిక మాధ్యమ ఖాతాలో స్పందించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా చేసిన విమర్శలను కూడా తన పోస్టుకు జత చేశారు.

ఎన్నికల తర్వాత నిబంధనల మార్పేంటి.?

ఒక ఎన్నిక పూర్తయిన తర్వాత, వెలువడిన ఫలితం నచ్చలేదనే కారణంతో ప్రభుత్వం నిబంధనలను ఎలా మార్చుతుందని పవన్ ఖేరా ప్రశ్నించారు. ఎన్నికైన పాలకవర్గం సజావుగా పనిచేయకుండా అడ్డుకునేందుకు మహారాష్ట్ర మంత్రిమండలి బుధవారం కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను మినహాయించి, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన సహకార సంస్థల నిర్వహణ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించాలని నిర్ణయించిందని వెల్లడించారు. వీరిలో నలుగురికి ఓటు హక్కు కల్పించే ప్రతిపాదన కూడా ఉందని పేర్కొన్నారు.ఈ నిర్ణయం ద్వారా ఎన్నికల సమీకరణాలను మార్చి, పాల ఉత్పత్తిదారులు ఇచ్చిన తీర్పును తారుమారు చేసే అవకాశం ఉందని పవన్ ఖేరా విమర్శించారు. సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేశారు.

ఓట్ల చోరీ తర్వాత హక్కుల చోరీ!

మరోవైపు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ కార్డుకు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామంటూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపైనా కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఓట్ల చోరీ అనేది కేవలం ముందుమాట మాత్రమేనని, అసలు కథ హక్కుల చోరీ అని విమర్శించింది. తమ శాఖ పరిధిలోని సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు పొందాలంటే ఇకపై జీవ గుర్తింపు ధ్రువీకరణతోపాటు ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య కూడా తప్పనిసరి అవుతుందని మంత్రి పేర్కొన్నట్లు కాంగ్రెస్ వెల్లడించింది. లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి గత కొన్ని రోజులుగా పలుమార్లు చెబుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు.

మోదీ ప్రభుత్వ అధికారిక విధానమా?

సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును వినియోగించాలన్నది కేంద్ర ప్రభుత్వ అధికారిక విధానమా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ విధానం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు సహకార సంస్థల ఎన్నికల్లో ప్రజాతీర్పును మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, మరోవైపు సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపులో కొత్త నిబంధనలు తెరపైకి వస్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

ప్రభుత్వం నిర్మించిన ఇళ్లలో లబ్ధిదారులు సంతోషంగా దీపావళి జరుపుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఇందిరమ్మ జయంతికి భారీ సభ

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడంతోపాటు మహిళలకు చీరల పంపిణీ చేపట్టనున్నారు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం అందించనున్నారు. ఇందుకోసం నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు.

ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు

ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, రెండు వర్గాలకు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ఇందుకు సంబంధించి 2003 నాటి తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చట్టాన్ని రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కమిషన్‌లో ఒక చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతోపాటు ఆయా వర్గాల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రివర్గం అభిప్రాయపడింది.

అగ్నిమాపక చట్టానికి సవరణ

తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం-1999కు సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రమాదాలకు గల కారణాలను గుర్తించడం, వాటిపై వేగంగా స్పందించేలా చర్యలు తీసుకోవడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశం. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల యజమానులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అగ్నిమాపక శాఖ చేపట్టాల్సిన చర్యలను కొత్త నిబంధనల్లో పొందుపరచనున్నారు. అగ్ని ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ఈ మార్పులు ఉపయోగపడనున్నాయి.

సర్వే అప్పీళ్ల గడువు కుదింపు

తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం-1923లోని 12(ఏ) సెక్షన్‌కు సవరణ చేసే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునేందుకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు చట్ట సవరణ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది.

ఫుట్‌బాల్‌కు క్రిస్టియానో రొనాల్డో గుడ్‌బై

- 23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు

లిస్బన్ (ప్రశ్న న్యూస్) రెండు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌ను శాసించిన పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌కు ఊహించని రీతిలో ముగింపు పలికాడు. జాతీయ జట్టు కోచ్ జార్జ్ జీసస్‌తో వచ్చిన విభేదాల నేపథ్యంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్ అవుతున్నట్లు గురువారం అధికారికంగా ప్రకటించాడు. గత నెలలో నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో తనను బెంచ్‌కే పరిమితం చేయడంతో తీవ్ర అసంతృప్తికి గురైన రొనాల్డో, టీమ్ క్యాంప్ నుంచి మధ్యలోనే బయటకు వెళ్లిపోయాడు. ఈ వివాదం చివరకు అతడి రిటైర్మెంట్‌కు దారితీసింది. 41 ఏళ్ల రొనాల్డో పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లలో ఏకంగా 146 గోల్స్ సాధించి ప్రపంచ పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలోనే ఆల్ టైమ్ లీడింగ్ స్కోరర్‌గా నిలిచాడు. యూరో 2004 ముంగిట ప్రారంభమైన ఈ అద్భుత ప్రయాణంలో అతడు ఆరు ప్రపంచకప్‌లలో ఆడాడు. పోర్చుగల్‌కు 2016 యూరోపియన్ టైటిల్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించాడు.

తన వీడ్కోలు సందేశంలో రొనాల్డో పోర్చుగల్ అభిమానులతో పాటు సహచరులకు భావోద్వేగ లేఖ రాశాడు. "పోర్చుగల్ ప్రజలారా, జాతీయ జట్టు నంబర్ 7 జెర్సీని మనందరి భవిష్యత్తు కోసం తిరిగి అప్పగించే సమయం వచ్చింది. ఈ జెర్సీ కేవలం నా సొంతం అని నేను ఎప్పుడూ భావించలేదు. అయితే 23 ఏళ్ల పాటు దీనిని ధరించే అదృష్టం, బాధ్యత నాకు దక్కింది. మైదానాల్లో దీనిని కాపాడుతూ ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లాను. ఈ రోజు ఆ చారిత్రక నంబర్ 7ను భవిష్యత్ తరానికి అప్పగిస్తున్నాను" అని సోషల్ మీడియా వేదికగా తెలిపాడు. ప్రయాణంలో గొప్ప విజయాలతో పాటు మర్చిపోలేని బాధాకరమైన పరాజయాలు కూడా ఎదురయ్యాయని, అయితే దేశానికి ప్రాతినిధ్యం వహించడంలో తన నిబద్ధత ఎప్పుడూ తగ్గలేదని గుర్తు చేసుకున్నాడు.

సహచరులు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు

తన అద్భుతమైన కెరీర్‌లో తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రొనాల్డో కృతజ్ఞతలు తెలిపాడు. "కోచ్‌లు, డైరెక్టర్లు, డాక్టర్లు, ఫిజియోథెరపిస్టులు, సహాయక సిబ్బంది నా ప్రయాణంలో భాగమయ్యారు. ఫొటోల్లో కనిపించని ఎంతో మంది కష్టం లేకుండా నా విజయాలు సాధ్యం కావు. నా కలను పంచుకుని, నాకోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబానికి రుణపడి ఉంటాను. మీరు ఎల్లప్పుడూ వెన్నంటే ఉండటం వల్లే నేను ఇంతవరకు చేరుకోగలిగాను" అని పేర్కొన్నాడు.

పోర్చుగల్ ఫుట్‌బాల్‌లో ఒక శకం ముగింపు: తలెత్తుకుని నిష్క్రమణ

రొనాల్డో నిష్క్రమణతో పోర్చుగల్ ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగం ముగిసింది. "ఈ రోజు నేను తలెత్తుకుని జాతీయ జట్టు నుంచి నిష్క్రమిస్తున్నాను. నా శక్తినంతా పోర్చుగల్ కోసమే ధారపోశాను. ప్రపంచంలోనే అత్యుత్తమ దేశానికి ప్రాతినిధ్యం వహించే గౌరవాన్ని పొందడమే నా అతిపెద్ద విజయం. నన్ను నమ్మినందుకు అందరికీ ధన్యవాదాలు" అని ముగించాడు.

పధానికి అధికారికంగా లేఖ రాయండి

చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

రాజ్యాంగ పుస్తకం పట్టుకుంటే సరిపోదు

హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హటావో' యాత్రలో అమిత్ షా ప్రసంగించారు. పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే ప్రయోజనం లేదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు చేయడం, ఆందోళనలకు దిగడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు.

చొరబాటుదారుల ఓట్లపై అభ్యంతరమెందుకు?

మృతుల పేర్లతో పాటు మూడు కోట్ల మంది బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అభ్యంతరమని అమిత్ షా ప్రశ్నించారు. చొరబాటుదారులే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని స్పష్టం చేశారు.

పార్లమెంట్ చర్చలకు అత్యున్నత వేదిక

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ చర్చలకు అత్యున్నత వేదిక అని అమిత్ షా పేర్కొన్నారు. అలాంటి వేదికలో కీలక అంశాలపై చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట వీధుల్లో ఆందోళనలు చేస్తూ అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. 80 ఏళ్ల ప్రజాస్వామ్యం తమ మోసాలకు లొంగిపోతుందని కాంగ్రెస్ భావిస్తోందా అని ప్రశ్నించారు. పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే, వాటిని ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని తొలగించండి' యాత్ర రాహుల్ గాంధీకి బలమైన సమాధానమని అమిత్ షా పేర్కొన్నారు.

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే

చెందిన 24 ఏళ్ల కండక్టర్ గుండ్ల ప్రవళిక మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న పల్లెవెలుగు బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. అశ్వాపురం మండలం మిట్టగూడెం సమీపంలో ప్రయాణికురాలు బానోత్ మౌనికతో టికెట్ విషయంలో వాగ్వాదం జరిగింది. రూ.100నోటుకు చిల్లర తిరిగి ఇచ్చే విషయంలోనూ వివాదం తలెత్తినట్లు సమాచారం.ఈ క్రమంలో కదులుతున్న బస్సు నుంచి ప్రవళికను బయటకు తోసేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ప్రవళిక మృతి చెందారు. ఈ ఘటన ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులను షాక్ కు గురి చేసింది. దీంతో భద్రతా చర్యలు మరింత కఠినం చేయాలని డిమాండ్ తెరమీదకు వచ్చింది. ఇప్పుడు తెలంగాణ ఆర్టీసీ ప్యాసింజర్ డోర్లు ఉన్న అన్ని బస్సుల్లో ప్రయాణ సమయంలో తలుపులు తప్పనిసరిగా మూసి ఉంచాలని స్పష్టం చేసింది. డోర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలని, లోపాలుంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించింది. బస్సులు ప్రయాణంలో ఉన్నప్పుడు తలుపులు తెరిచి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించింది. క్షేత్రస్థాయి అధికారులు ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బస్సు తలుపులు సరిగా పనిచేస్తున్నాయా, ప్రయాణ సమయంలో మూసి ఉన్నాయా అనే అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది భద్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు భావిస్తున్నారు. గతంలోనూ బస్సుల్లో డోర్స్ తెరిచి ఉంచడం వల్ల ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు కఠిన నిబంధనలు అమలు చేయడం వల్ల ఇలాంటి విషాదాలు తగ్గే అవకాశం ఉంది.

మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు

బలపడిన క్రీడా వ్యవస్థే కారణమని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా అథ్లెట్లతో కలిసి మోదీ ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. పారా గేమ్స్లో మహిళా అథ్లెట్ల చూపిన అద్భుత ప్రదర్శన గురించి ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్ నుంచి బరిలోకి దిగిన 56 మంది మహిళా అథ్లెట్లలో 34 మంది పతకాలు గెలుచుకున్నారని కొనియాడారు.

అలాగే, క్రీడలకు రెండు నెలల ముందు మరణించిన తన తల్లికి జావెలిన్ త్రోయర్ రింకు తన బంగారు పతకాన్ని అంకితం చేస్తూ భావోద్వేగానికి గురైన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. "ఆసియా పారా గేమ్స్‌కు కేవలం రెండు నెలల ముందు రింకు తన తల్లిని కోల్పోయారు. అంతటి తీవ్రమైన దుఃఖంలో కూడా ఆయన ధైర్యం కోల్పోకుండా, స్వర్ణ పతకం గెలిచినప్పుడు తన తల్లి ఫొటోను చేతిలోకి తీసుకుని ఆ పతకాన్ని ఆమెకు అంకితం చేశారు. ఆ క్షణం దేశంలోని ప్రతి పౌరుడినీ కంటతడి పెట్టించింది" అని మోదీ పేర్కొన్నారు. భారతదేశ క్రీడా వ్యవస్థలో తగినంత వనరులు లేకపోవడం, మద్దతు, పారదర్శకత కొరవడటం వంటి సవాళ్లను ఎదుర్కోవడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపడానికి ఉత్సాహం చూపలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే, క్రీడాకారుల మాదిరిగానే దేశం కూడా ఈ సవాళ్లను అధిగమించి, తన లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించిందన్నారు. ఇక, 4 క్రీడా ఈవెంట్లలో పోడియంపై ఉన్న మూడు స్థానాలను (బంగారం, వెండి, కాంస్యం) భారత అథ్లెట్లే కైవసం చేసుకుని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని మోదీ అన్నారు. అయితే, పోటీల చివరి రోజున మన అథ్లెట్లు ఏకంగా 9 స్వర్ణ పతకాలను సాధించి అద్భుతం చేశారని కొనియాడారు.

అర్చకులా... రోజువారీ కూలీలా

- శివాలయంలో ప్రధాన అర్చకుడి 'సొంత సామ్రాజ్యం..

- ముగ్గురికి అనుమతి.. 13 మందితో పూజల నిర్వహణ..

- రోజుకు రూ.500 ఇచ్చి అర్చకులను కూలీలుగా వాడుకుంటున్నారనే ఆరోపణలు..

- ఆలయ ఆదాయానికి గండి.. ప్రధాన అర్చకుడి కుటుంబానికే పెద్దపీట..

-దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు.. విచారణకు ఆదేశాలు..

- అధికారుల ఉత్తర్వుల మేరకు చర్యలు: ఈఓ వీరారెడ్డి



గుంటూరు (ప్రశ్న న్యూస్) అర్చకులా... రోజువారీ కూలీలా? దేవుడి సేవ చేయాల్సిన చేతులు కూలీ పనికి పరిమితమవుతున్నాయా? ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయంలో పూజలు నిర్వహించాల్సిన అర్చకుల సంఖ్య ముగ్గురే అయినా.. ఆ పరిమితిని పక్కనపెట్టి ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో అనధికారికంగా 13 మందితో పూజా కార్యక్రమాలు సాగుతున్నాయనే ఆరోపణలు కొత్తపేట శివాలయంలో కలకలం రేపుతున్నాయి. ఆలయంలో జరిగే పూజలు, హోమాలు, అభిషేకాల ద్వారా వచ్చే ఆదాయం దేవస్థాన ఖజానాకు చేరాల్సి ఉండగా.. దానిపై ప్రధాన అర్చకుడి కుటుంబమే పెత్తనం చెలాయిస్తోందన్న ఫిర్యాదులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల వరకు వెళ్లాయి. ఈ వ్యవహారంపై అధికారులు విచారణకు ఆదేశించడంతో ఆలయంలో జరుగుతున్న తతంగంపై చర్చ మొదలైంది.

ముగ్గురికి అనుమతి.. 13 మందితో వ్యవహారం...

ప్రభుత్వ ఆధీనంలోని దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం కొత్తపేట శివాలయంలో భక్తులకు అవసరమైన అర్చనలు, యజ్ఞాలు, హోమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ముగ్గురు అర్చకులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఈ నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన అర్చకుడు తన ఆధ్వర్యంలో సుమారు 13 మందిని రోజువారీ విధానంలో ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరితో ఆలయంలోని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. వచ్చిన ఆదాయాన్ని ప్రధాన అర్చకుడే తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.దేవుడి సేవలో భాగంగా అర్చకులు నిర్వహించే పూజలకు భక్తులు చెల్లించే మొత్తాలు ఆలయ ఆదాయంలో భాగం కావాల్సి ఉండగా.. ఆ వ్యవహారం ఎలా సాగుతోంది? అనధికారికంగా నియమించిన వ్యక్తులకు ఏ ప్రాతిపదికన విధులు అప్పగిస్తున్నారు? వారి ద్వారా జరిగే పూజల ఆదాయం దేవస్థాన ఖాతాల్లో జమ అవుతోందా? లేక వ్యక్తిగతంగా వసూలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం సాగితే ఆలయ ఆదాయానికి గండి పడే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రోజుకు రూ.500.. అర్చకులా, కూలీలా..

ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో పనిచేస్తున్న అనధికార అర్చకులకు రోజుకు రూ.500 చొప్పున చెల్లిస్తూ.. వారిని కూలీల మాదిరిగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు మరింత వివాదానికి దారితీస్తున్నాయి. ఆలయంలో పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించే వ్యక్తులకు విధులు, పారితోషికం, ఆదాయ పంపిణీపై స్పష్టమైన విధానం ఉందా? రోజువారీ కూలీ పేరుతో అర్చకులను నియమించుకోవడానికి ఎవరు అనుమతి ఇచ్చారు? ప్రభుత్వ ఉత్తర్వులు అమలవుతున్నాయా? అన్న అంశాలపై సమగ్ర విచారణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అర్చకుల నియామకం, విధుల నిర్వహణ, ఆలయ ఆదాయ సేకరణ వంటి అంశాలు దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఉండాల్సి ఉండగా.. ప్రధాన అర్చకుడి ఇష్టారాజ్యంగా వ్యవహారం సాగుతోందనే ఆరోపణలు అధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

కార్యాలయం వెనుక భవనంలో కుటుంబ నివాసం..

ఆలయ ప్రాంగణంలో ఈఓ కార్యాలయం వెనుక ఉన్న భవనంలో ప్రధాన అర్చకుడు తన కుటుంబంతో కలిసి ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్నారని, అందుకు దేవస్థానానికి ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని ఫిర్యాదులో మరో అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ఆలయానికి చెందిన భవనాన్ని నివాస అవసరాలకు ఉపయోగిస్తుంటే.. దానికి అనుమతి ఉందా? అద్దె లేదా ఇతర చెల్లింపులు ఎందుకు లేవు? భవన వినియోగంపై దేవాదాయ శాఖ రికార్డుల్లో ఏముంది? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.దేవస్థానానికి చెందిన ఆస్తులు ప్రజల భక్తి, విరాళాలు, ధార్మిక అవసరాలతో ముడిపడి ఉంటాయి. వాటి వినియోగంలో పారదర్శకత తప్పనిసరి. ఆలయ ఆస్తిని వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే ఈ అంశాలపై పూర్తి వివరాలు, సంబంధిత రికార్డులు, అనుమతులు పరిశీలించిన తర్వాతే వాస్తవ పరిస్థితి తేలాల్సి ఉంది.

వ్యాపారుల వివాదంతో బయటపడిన వ్యవహారం..

ఇటీవల ఆలయ ప్రాంగణంలోని వ్యాపారులతో జరిగిన వివాదం నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆలయ పరిధిలోని వ్యాపార కార్యకలాపాలు, అర్చకుల వ్యవహారం, ఆదాయ సేకరణ, భవన వినియోగం వంటి అంశాలపై ప్రశ్నలు తలెత్తడంతో ఈ వివాదం దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆలయంలో రోజువారీగా జరిగే పూజల ఆదాయం ఎంత? అధికారిక అర్చకులు ఎవరు? అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై ఆధారాలు ఏమిటి? అన్న అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి.

ఫిర్యాదు.. విచారణకు ఆదేశాలు..

శివాలయంలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఆలయంలో జరుగుతున్న ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని, అధికారులు ఇచ్చే ఉత్తర్వుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఈఓ వీరారెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం.విచారణలో ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో అనధికారికంగా అర్చకులను నియమించుకున్నారా? ఆలయ ఆదాయం వ్యక్తిగతంగా వసూలు చేస్తున్నారా? రోజువారీ చెల్లింపులకు సంబంధించిన రికార్డులు ఉన్నాయా? ఆలయ భవనాన్ని నివాసానికి ఉపయోగించేందుకు అనుమతి ఉందా? అనే అంశాలను పరిశీలించాల్సి ఉంది. ఆరోపణలు నిర్ధారణ అయితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవడం, ఆలయ ఆదాయాన్ని క్రమబద్ధీకరించడం, ఆస్తుల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం అధికారుల ముందున్న బాధ్యత.

దేవుడి ఆదాయం.. ఎవరి ఖజానాకు..

ప్రభుత్వ ఉత్తర్వులను పక్కనపెట్టి ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో వ్యవహారం సాగుతోందనే ఆరోపణలు నిజమా? లేక ఆలయంలో విధుల నిర్వహణపై అపోహలేనా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. దేవస్థానానికి రావాల్సిన ఆదాయం ఎక్కడికి వెళుతోంది? అర్చకుల నియామకంలో నిబంధనలు పాటిస్తున్నారా? ఆలయ ఆస్తుల వినియోగానికి అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

ఆదర్శ గ్రామ పంచాయతీగా "ఇల్లూరు" ఎంపిక..

- పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీగా ఇల్లూరు సెలెక్ట్

- కులమత రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి..

- ఇల్లూరు ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత

- రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్

మధిర మండలంలో నెంబర్ వన్ గ్రామంగా ఇల్లూరు ను ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచి గ్రామ ప్రజలు.కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామాల్లోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పారిశుధ్య కార్యక్రమాలు ఇతర వాటిలి పరిగణలోకి తీసుకొని గ్రామపంచాయతీలను పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీలను ఎంపిక చేయటం జరిగింది దానిలో భాగంగా మధిర మండలం నుండి ఇల్లూరు గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామంలోని కులమత రాజకీయాలకు అతీతంగా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ గ్రామంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు సహకరించిన జిల్లా, మండల అధికారులకు సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యసేవలో ఆటంకాలు లేకుండా
సేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



మంచిర్యాల : జాతీయ ఆరోగ్య మిషిన్ ఎన్‌హెచ్‌ఎం ఎం వైద్య సిబ్బంది ధర్నాలో ఉన్నందున వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మంచి ర్యాల జిల్లా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆదేశించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు సిబ్బందితో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించడం, నమోదు చేయడం, నిశ్చయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్టులను అందజేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ, గర్భవతుల నమోదు, ఆసుపత్రిలో ప్రసవాలు, అమ్మఒడి అంబులెన్స్ సర్వీస్ లను ఉపయోగించుకొనుట, కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులు, సిబ్బంది పరిశుభ్రతపై, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలోజిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ, సీహెచ్‌వో జయమేరీ, పర్యవేక్షకులు రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ ధాటికి
కొట్టుకుపోయిన లో లెవల్ చప్టా

- వంతెన నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

- రూ.1.60 కోట్లు మంజూరు చేసినా ప్రారంభానికి నోచుకోని పనులు



ములకలపల్లి : ములకలపల్లి మండల పరిధిలోని పూసుగూడెం వీకే రామవరం మధ్య ఉన్న లో లెవల్ చప్టా మురసు తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సర్పంచ్ గుగులోత్ ధర్మా, తాటి రవి చప్టాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూసుగూడెం నుండి వీకే రామవరం, సంజీవపల్లి, కొత్తూరు తదితర గ్రామాల మీదుగా బూర్గంపాడు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ చప్టా ఉందని తెలిపారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షాలకే చప్టాపై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 2024లో ప్రభుత్వం హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ. 1.60 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా శంకుస్థాపన కూడా నిర్వహించారని గుర్తుచేశారు.దీంతో తమ కష్టాలు తీరుతాయని భావించిన గ్రామస్తులకు నిరాశే మిగిలిందన్నారు. శంకుస్థాపన జరిగి ఇంతకాలం గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి పెరిగి చప్టా పూర్తిగా కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హై లెవల్ వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

రేపటి నుండి అర్వపల్లి దర్గా ఉత్సవాలు

- రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా తరలి రామన్న భక్తులు

అర్వపల్లి : మత సామరస్యానికి ప్రతికగా నిలిచే అర్వపల్లి శివారులో కొలువైన హజ్రత్ సయ్యద్ ఖాజా నసిరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు రేపు ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. ఈ ఉర్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వేలాది భక్తులు తరలిరానున్నారు. వక్స్ బోర్డు, జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేసి గంధాన్ని అత్యంత వైభవంగా భక్తుల నడుమ దర్గాకు తీసుకురానున్నారు. అనంతరం అర్ధరాత్రి ఖావ్వాలి నిర్వహిస్తారు. 7వ తేది శనివారం బాబా సన్నిధిలో భక్తిశ్రద్ధలతో చిరాగ్ కార్యక్రమం జరుగుతుంది. ఈ ఉర్సుకు ముస్లింలతో పాటు హిందువులు కూడా హాజరై బాబాని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. జాతీయ రహదారి నుండి దర్గాకి వెళ్లే దారి గుంతలు పడి ఉండడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వక్స్ బోర్డు రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ అమీర్ అహ్మద్, జిల్లా ఇన్‌స్పెక్టర్ దస్తగిరి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్ఐలు, వంద పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాతావరణ మార్పులపై సమరశంఖం

నిర్వహించనున్నారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా జరగనున్న ఈ ప్రత్యేక సమావేశంలో సుమారు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు.డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భవిష్యత్ నగరంలోని యువభారత నైపుణ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రపంచ పెట్టుబడుల సదస్సు జరగనుంది. ఈ ఏర్పాట్ల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు వేదిక, వివిధ సమావేశ మందిరాలు, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ప్రతినిధులకు ప్రత్యేక అధికారులు

సదస్సుకు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక సమన్వయ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే అందజేయడంతోపాటు, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పెట్టుబడుల ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని సూచించారు. నవంబర్ 15 నాటికి సదస్సు ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆరు ప్రదర్శనశాలల ఏర్పాటు

గత ఏడాది నిర్వహించిన తెలంగాణ అభివృద్ధి సదస్సుతో పోలిస్తే ఈసారి మరింత విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. గతంలో ఒక ప్రదర్శనశాల మాత్రమే ఉండగా, ఈసారి ఆరు ప్రదర్శనశాలలను ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాలను రూపొందించారు. రక్షణ రంగ ప్రదర్శన, భారతీయ వినోద పరిశ్రమ ప్రదర్శన, నూతన సంస్థల ప్రదర్శనశాల, ఔషధ మరియు జీవశాస్త్ర పరిశ్రమల ప్రదర్శన, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ ప్రత్యేక ప్రదర్శనశాల, విద్యా ప్రదర్శన, వాతావరణ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రక్షణ రంగంలో ఆధునిక ఆవిష్కరణలు

రక్షణ, వైమానిక, అంతరిక్ష, అంతర్జాల భద్రత రంగాలకు చెందిన ఆధునిక పరికరాలు, మానవరహిత విమానాలు, రోబోటిక్ పరికరాలను రక్షణ రంగ ప్రదర్శనలో ఉంచనున్నారు. వైమానిక విన్యాసాలు నిర్వహించేలా కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు ఇప్పటికే 49 సంస్థలు ముందుకొచ్చాయి. చిత్ర, దృశ్య, ఆటల రూపకల్పన, వినోద రంగాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

136 నూతన సంస్థల ఆవిష్కరణలు

నూతన సంస్థల కోసం ప్రత్యేక ప్రదర్శనశాలను ఏర్పాటు చేసి 136 సంస్థల ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. తెలంగాణ ఆవిష్కరణల సవాలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఔషధ, జీవశాస్త్ర రంగాలకు చెందిన 60 సంస్థల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ ప్రదర్శనశాలలో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ మానవరహిత విమానాలు, పాడి పరిశ్రమ, మత్స్య రంగం, ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రత్యేక స్థానం

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక ప్రదర్శనశాలను ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, నర్సరీ విద్య నుంచి ప్రపంచస్థాయి ఉన్నత విద్య వరకు తెలంగాణ విద్యారంగ ప్రస్థానం ప్రతిబింబించేలా చర్చలు నిర్వహించాలని ఆదేశించారు. మూడు రోజుల సదస్సులో నాలుగు ప్రధాన సమావేశ మందిరాల్లో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించనున్నారు. వీటి నిర్వహణ కోసం 25 రంగాలవారీ కార్యనిర్వాహక మండళ్లను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు.

కరువును తట్టుకునే వ్యవసాయంపై దృష్టి

వాతావరణ మార్పుల ప్రభావం, ఎల్‌నినో కారణంగా తలెత్తే సమస్యలు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే అంశాలపై డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ వాతావరణ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయ విధానాలు, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు మరియు జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చే విధానాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు
గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



కమాన్ పూర్, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు.కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలిగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకుందన్నారు. ప్రక్కన పెద్దపల్లి నియోజకవర్గంలో గత వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా మండలం పరిధిలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, చిందం తిరుపతి, రాచకొండ రవి, నీలం శ్రీనివాస్, జాబు సతీష్, , రాచకొండ చంద్రమౌళి, పెండ్లి నారాయణ, పొట్ల సతీష్, కొయ్యడ సంపత్, పంతకాని రవి, నడిగొట్టు సంపత్, పొట్ల శంకర్, కొండిల్ల ఓదెలు, గుర్రం శంకర్, ఒడ్నాల సతీష్, షేక్ మొహినుద్దీన్, దండే రమేష్ ఠాగూర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై మూడు సమీక్షలు.. భక్తుల సేవలో లోపాలుంటే చర్యలు

అన్నప్రసాదం నుంచి లీజుల వరకు.. ఈవో శీనా నాయక్ కొరడా..

దసరా డిజిటల్ వైభవానికి 2.29 కోట్ల వీక్షణలు..

కార్తీకం, భవానీ దీక్షల రద్దీకి ముందే అప్రమత్తం



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై భక్తుల సేవలే కీలకం.. నిబంధనల ఉల్లంఘనకు తావులేదు , కార్తీక మాసం, భవానీ దీక్షల రద్దీకి ముందే దేవస్థానం యంత్రాంగం అప్రమత్తమైంది. అన్నప్రసాదం నాణ్యత, లీజులు--లైసెన్సుల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై గురువారం మూడు వేర్వేరు సమీక్షలు నిర్వహించింది. భక్తులకు నాణ్యమైన సేవలు అందించాలని, నిర్దేశిత ధరలకు మించి వసూళ్లు చేయకుండా తనిఖీలు చేపట్టాలని ఈవో వి.కె. శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. మరోవైపు దసరా ఉత్సవాల డిజిటల్ ప్రసారాలకు 15 రోజుల్లో 2.29 కోట్ల వీక్షణలు నమోదైనట్లు దేవస్థానం వెల్లడించింది.

అన్నప్రసాదంలో నాణ్యతకు పెద్దపీట..

భక్తులకు నిరంతరం అందించే అన్నప్రసాదం తయారీ, నాణ్యత, పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే నియమించిన ప్రత్యేక కమిటీ అభిప్రాయాలపై ఈవో ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు.హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి వంటశాల ఆధునీకరణ, అధునాతన యంత్రాల వినియోగం, వేగవంతమైన పంపిణీపై కార్యాచరణ రూపొందించారు. అక్షయ పాత్ర ద్వారా దేశవ్యాప్తంగా ఆహార సేవలు అందిస్తున్న ఫౌండేషన్ అనుభవాన్ని ఇంద్రకీలాద్రి అన్నప్రసాదం వ్యవస్థలో వినియోగించుకునే అంశంపై చర్చించారు.
భక్తులకు స్వచ్ఛమైన, రుచికరమైన వేడి అన్నప్రసాదం అందించడమే లక్ష్యంగా నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచాలని ఈవో సూచించారు. ప్రస్తుతం భోజనం తయారీకి అవుతున్న ఖర్చు, ఆధునిక వంటశాలలో అయ్యే ఖర్చును బేరీజు వేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

లీజుదారులకు హెచ్చరిక.. అధిక వసూళ్లపై నిఘా..

దేవస్థానం పరిధిలోని దుకాణాలు, సేవా కేంద్రాల నిర్వహణపై కూడా ఈవో సమీక్షించారు. లీజుదారులు, లైసెన్సుదారులు ఆలయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. భక్తులకు నాణ్యమైన సేవలు నిర్దేశిత ధరలకే అందించాలని, అధిక ధరలు వసూలు చేసే వారిపై నిరంతర తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లీజు రుసుముల వసూళ్లలో నిర్లక్ష్యం వహించకుండా బకాయిలను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భక్తుల లగేజీ కేంద్రాలు, చెప్పుల భద్రపరిచే ప్రదేశాల్లో లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కార్తీక మాసం, భవానీ దీక్షల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని సేవా విభాగాల పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు.

- కార్తీకం.. భవానీ దీక్షలకు ముందస్తు కసరత్తు..

రానున్న కార్తీక మాసం, భవానీ దీక్షల సమయంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఈవో ఆదేశించారు. భక్తులకు సంతృప్తికరమైన ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా సేవా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు.అన్నప్రసాదం నాణ్యత నుంచి లీజుల నిర్వహణ వరకు.. భక్తులకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, నాణ్యత, నిబంధనల అమలే ప్రధానమని దేవస్థానం యంత్రాంగం స్పష్టం చేసింది.

కాళేశ్వరం పునరుద్ధరణపై సర్కార్ నిర్ణయం

– రూ.4,193 కోట్లతో ప్రతిపాదనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు మరోసారి రాజకీయ, సాగునీటి రంగాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి, మరమ్మతుల పురోగతి, గోదావరి జలాల వినియోగంపై సభలో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి సురక్షితంగా వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిర్మాణ సంబంధిత తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థలు, నిపుణుల సలహాలు తీసుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద నీరు కనిపిస్తున్నప్పటికీ దాన్ని ఎందుకు ఎత్తిపోస్తున్నారంటూ వస్తున్న విమర్శలపై కూడా కేబినెట్ సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుత నీటిమట్టం, బ్యారేజీల పరిస్థితుల దృష్ట్యా అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదని ఇంజనీర్లు వివరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మేడిగడ్డ నుంచి ఎత్తిన నీరు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూసివేయాల్సి ఉంటుందని అయితే భద్రతా కారణాలతో ఆ గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన విషయాన్ని అధికారులు వివరించారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సుమారు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నిర్మాణ లోపాల కారణంగా చేపట్టాల్సిన మరమ్మతుల ఖర్చును సంబంధిత నిర్మాణ సంస్థలే భరించేలా అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. ప్రాథమిక పునరుద్ధరణ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని కూడా వెల్లడించారు.ఈ నెలాఖరులోగా తుది అనుమతులు పొందేందుకు ప్రయత్నించాలని.. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలని సీఎం రేవంత్ అధికారులకు ఆదేశించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని తిరిగి సాధించే పనులు, బ్యారేజీల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను రెండు దశలుగా విభజించాలని సూచించారు. పనుల్లో ఆలస్యం జరగకుండా అనుమతులు, సాంకేతిక పరిశీలనలు, ఇతర ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని చెప్పారు.

గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేందుకు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తరలించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే ప్రస్తుత ప్రభుత్వం 3 ఏళ్లలో సగటున 18.13 టీఎంసీలకు పెరిగిందని తెలిపారు. ఇది గతంతో పోలిస్తే 89 శాతం అధికమని పేర్కొన్నారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు మొత్తంగా 24.81 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించినట్లు వెల్లడించారు.ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గత 3 ఏళ్లలో ప్రాజెక్టు మరమ్మతులు, బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకున్న చర్యలను సభలో వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాళేశ్వరం పరివాహక జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు గోదావరి ప్రాంతాన్ని సందర్శించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గోదావరి నుంచి నీటి ప్రవాహం, ఎత్తిపోతల ప్రక్రియ, ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలిస్తున్నారంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, గోదావరి వద్దే మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించాలని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇంద్రకీలాద్రికి విరాళాల వెల్లువ

- అన్నదానానికి రూ.1.01 లక్షలు..

గోసంరక్షణకు రూ.2 లక్షలు

- దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సేవాభావం..

దాతలకు ఆలయ సత్కారం

విజయవాడ(ప్రశ్న న్యూస్) దుర్గమ్మ సన్నిధిలో దాతృత్వానికి చేయూత.. సేవా కార్యక్రమాలకు విరాళాల జోరు ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి గురువారం భక్తులు భారీగా విరాళాలు అందించారు. అన్నదానం, గోసంరక్షణ పథకాలకు చేయూతనిస్తూ తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ అన్నదాన ట్రస్ట్‌కు రూ.1,00,116 అందించగా.. విశాఖపట్నానికి చెందిన దంపతులు గోసంరక్షణ పథకానికి రూ.2 లక్షలు సమర్పించారు.

అన్నదానానికి అక్షయ చేయూత

హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన శ్రీ గజానన్ ఈ-స్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు ఇంద్రకీలాద్రి అన్నదానం ట్రస్ట్‌కు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ విరాళానికి సంబంధించిన నగదు, వివరాలను స్వీకరించారు.అనంతరం దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం పలికించారు. భక్తులకు అన్నప్రసాదం అందించే సేవలో



భాగస్వాములైన దాతలను ఆలయ అధికారులు సత్కరించారు.

గోసంరక్షణకు రూ.2 లక్షలు

విశాఖపట్నానికి చెందిన సతీష్ కుమార్ నారాయణశెట్టి, అనిత నారాయణశెట్టి దంపతులు దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ పథకానికి రూ.2 లక్షలు విరాళంగా సమర్పించారు. గురువారం ఆలయ అధికారుల సమక్షంలో దాతలకు దేవస్థానం బాండ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సేవలో భాగస్వామ్యం.. భక్తిలో దాతృత్వం

దుర్గమ్మ సన్నిధిలో భక్తులు అందించిన విరాళాలు అన్నదానం,



గోసంరక్షణ వంటి సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్నాయి. భక్తుల సహకారంతో దేవస్థానం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు మరింత బలం చేకూరుతోంది.

ఎమ్మెల్సీ బరిలో గెలుపు టీఆర్ఎస్ (డి) పార్టీ దే

- రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ

- నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో

డాక్టర్ భూసిరెడ్డి శంకర్‌రెడ్డి



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ భూసిరెడ్డి శంకర్‌రెడ్డిని టీఆర్ఎస్ (డెమోక్రటిక్) పార్టీ నియమించింది. ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ వెల్లడించారు. డాక్టర్ శంకర్‌రెడ్డి గతంలో రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా విశేష సేవలందించారని, కరోనా సమయంలో వేలాది మందికి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. రాజకీయ, సామాజిక రంగాల్లో అనుభవం కలిగిన ఆయనకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పార్టీ ప్రకటించింది. ఉద్యోగం, ఉపాధి, విద్య, ఆర్థిక భరోసా అంశాలను ఎన్నికల అజెండాగా ముందుకు తీసుకెళ్తామని పేర్కొంది. గ్రాడ్యుయేట్ల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతామని, ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్ల ప్రతినిధులతో కమిటీలు నిర్మిస్తామని తెలిపింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుంటామని వెల్లడించింది. సామాజిక తెలంగాణ, సామాజిక న్యాయం తమ పార్టీ నినాదమని, ఎమ్మెల్సీ పదవి హోదా కోసం కాకుండా పట్టభద్రుల హక్కుల సాధన కోసమేనని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ అభ్యర్థిత్వానికి ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, న్యాయవాద సంఘాలు, ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్సీ ఇన్‌చార్జి కాంపెల్లి ప్రభు కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి సాధు శంకర్, భద్రాచలం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి సింగటి నందనమాట తదితరులు

కార్తీకానికి కొండపై భారీ ఏర్పాట్లు

భవానీ భక్తులకు ఇబ్బందులొస్తే సహించం.. అధికారులకు ఈవో శీనా నాయక్ ఆదేశాలు

నవంబర్ 10 నుంచి కార్తీక పూజలు.. 11న గాజుల అలంకార దర్శనం..

డిసెంబర్ 30 నుంచి జనవరి 3 వరకు భవానీ దీక్ష విరమణలు

విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై రానున్న ఆధ్యాత్మిక వేడుకలకు దేవస్థానం యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కార్తీక మాస ప్రత్యేక పూజలు, అమ్మవారి గాజుల అలంకారోత్సవం, భవానీ దీక్షల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, అన్నప్రసాదం, తాగునీరు, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

కార్తీక పూజలకు పకడ్బందీ ఏర్పాట్లు..

నవంబర్ 10 నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆకాశదీపం, నిత్య అభిషేకాలు, బిల్వార్చనలు, కార్తీక పౌర్ణమి నాటి కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని ఈవో సూచించారు.
కార్తీక పూజలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు.

11న గాజుల అలంకార దర్శనం

భగినీ హస్తభోజనం పర్వదినం సందర్భంగా నవంబర్ 11న శ్రీ కనకదుర్గ అమ్మవారికి నిర్వహించనున్న విశేష గాజుల అలంకారోత్సవంపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లలో సౌకర్యాలు కల్పించాలని, ప్రసాద వితరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈవో సూచించారు.

భవానీ భక్తులకు ముందస్తు ఏర్పాట్లు

నవంబర్ 20 నుంచి ప్రారంభం కానున్న భవానీ దీక్షాధారణలు, డిసెంబర్ 24న జరిగే కలశజ్యోతి మహోత్సవం, డిసెంబర్ 30 నుంచి జనవరి 3 వరకు నిర్వహించే దీక్షా విరమణల ఏర్పాట్లపై అధికారులు విస్తృతంగా సమీక్షించారు.రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భవానీ భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున.. కేశఖండనశాలలు, స్నానఘట్టాలు, తాగునీరు, నిరంతర అన్నప్రసాదం, లడ్డూ ప్రసాద నిల్వలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.హోమగుండాల వద్ద భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, ఇంజినీరింగ్, భద్రతా విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

సమష్టి బాధ్యతతో పనిచేయాలి

కార్తీక మాసం, భవానీ దీక్షల సమయంలో భక్తులకు ఎలాంటి



అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమష్టి బాధ్యతతో పనిచేయాలని ఈవో శీనా నాయక్ ఆదేశించారు.
గురువారం పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో ఈవో అధ్యక్షతన జరిగిన సమీక్షలో స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యుడు శంకర శాండిల్య, డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఇంజినీరింగ్, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేటలో
యథేచ్ఛగా రోడ్డు ఆక్రమణలు

నిబంధనలకు తూట్లు, రహదారి స్థలాల్లోనే నిర్మాణాలు

ఖాళీ స్థలాలు వదలకుండానే భవన నిర్మాణాలు,

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



పెద్దఅంబర్‌పేట (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలోని ఎల్బీనగర్ జోన్, నాగోల్ సర్కిల్-11కు చెందిన పెద్దఅంబర్‌పేట వార్డులో అక్రమ నిర్మాణాలు, రహదారుల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వినాయక నగర్‌లోని కల్లెం బాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ఉన్న లేఅవుట్‌లో కొందరు భవన యజమానులు, నిర్మాణదారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక స్థల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరెండర్ చేసిన స్థలంలోనే నిర్మాణాలా.?

వినాయక నగర్‌లోని సర్వే నంబర్లు 599, 604 పరిధిలో కొందరు భవన యజమానులు భవన నిర్మాణ అనుమతులు పొందినప్పటికీ, అనుమతి పత్రాల్లో పేర్కొన్న నిబంధనలను పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాత లేఅవుట్‌లో 20, 25 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న రహదారులను కనీసం 30 అడుగులకు విస్తరించేందుకు అవసరమైన స్థలాన్ని మున్సిపాలిటీకి ఉచితంగా అప్పగిస్తున్నట్లు స్వీయ ధృవీకరణ పత్రాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే నిర్మాణాల సమయంలో అదే అప్పగించిన రహదారి స్థలంలో భవనాల పునాదులు, ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రహదారుల వెడల్పు తగ్గిపోవడమే కాకుండా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. భవిష్యత్తులో కాలనీలో తాగునీటి పైపులైన్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి సైతం రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు అడ్డంకిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపైకి వచ్చిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

ఫిర్యాదులు చేసినా స్పందన కరువు

అక్రమ నిర్మాణాలు, రహదారి ఆక్రమణలపై పలుమార్లు పెద్దఅంబర్‌పేట మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, డిప్యూటీ కమిషనర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నామమాత్రంగా నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత చర్యలు తీసుకోకుండా నిర్మాణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో తగిన చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు అధికారులు డ్యూటీ చేస్తున్నారా.? లేక కార్యాలయంలో నిద్రపోతున్నారా.? అంటూ స్థానికులు మండిపడుతున్నారు.

ఎల్ఆర్ఎస్ ప్లాట్ల యజమానులకు ఒక నిబంధనా.?

ఎల్ఆర్ఎస్ ద్వారా తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్న యజమానులకు ఒక నిబంధన, ఇతర భవన యజమానులకు మరో నిబంధనా.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రహదారులను ఆక్రమించి నిర్మించిన పునాదులు, ప్రహరీ గోడలను వెంటనే తొలగించి, లేఅవుట్‌లో రహదారుల అసలు వెడల్పును పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వరదలోకి దూకి.. ముగ్గురికి ప్రాణభిక్ష

- ఉధృత ప్రవాహంలో సాహసమే ఆయుధం..

మహిళలను కాపాడిన సీఐ సుబ్బనాయుడు..

- నడుముకు తాడు కట్టుకుని నీటిలోకి..

పోలీసుల సమయస్ఫూర్తికి హోంమంత్రి అనిత ప్రశంసలు



అమరావతి(ప్రశ్న న్యూస్) వరద ఉధృతి.. ప్రాణాలు అరచేతిలో.. అయినా వెనక్కి తగ్గలేదు కళ్లముందే ముగ్గురు మహిళలు వరద ప్రవాహంలో చిక్కుకోవడంతో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బనాయుడు సాహసానికి సిద్ధమయ్యారు. నడుముకు తాడు కట్టుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి దూకారు. పోలీసు సిబ్బంది సహకారంతో ఒక్కొక్క మహిళను ఒడ్డుకు చేర్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సీఐ చూపిన తెగువకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశంసలు కురిపించారు.

వరదలో చిక్కుకున్న మహిళలు..

గుంటూరు జిల్లా చిలకలూరిపేట పరిధిలోని తిమ్మాపురం అండర్‌పాస్ వద్ద ముగ్గురు మహిళలు వరద నీటిలో చిక్కుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్పటికే అండర్‌పాస్‌లో వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో మహిళలను బయటకు తీసుకురావడం ప్రమాదకరంగా మారింది. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బనాయుడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు.

ప్రాణాలకు తెగించి.. నీటిలోకి

వరద ఉధృతి చూసి వెనుకడుగు వేయలేదు. మహిళలను ఎలాగైనా సురక్షితంగా బయటకు తీసుకురావాలనే సంకల్పంతో సీఐ తన నడుముకు తాడు కట్టుకుని వరద నీటిలోకి దూకారు. ప్రమాదకర పరిస్థితుల్లో మహిళల వద్దకు చేరుకుని పోలీసు సిబ్బంది సహకారంతో రక్షణ చర్యలు చేపట్టారు. సమన్వయంతో ఒక్కొక్క మహిళను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.సీఐ సుబ్బనాయుడు ధైర్యసాహసాలు, సిబ్బంది సమయస్ఫూర్తి కారణంగా ముగ్గురు మహిళలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు పోలీసులు చూపిన చొరవ స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

పోలీసుల సాహసానికి హోంమంత్రి అభినందనలు

ఈ ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. వరద ప్రవాహంలో చిక్కుకున్న మహిళలను కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాహసం చేసిన సీఐ సుబ్బనాయుడు, ఆయన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ప్రజల ప్రాణాలను రక్షించడంలో పోలీసులు చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో బాధ్యతతో వ్యవహరిస్తూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు.

తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి
జోరందుకున్న రాజకీయ సమీకరణాలు

అధికార పక్షం వ్యూహాలు.. ప్రతిపక్షాల విమర్శలు.. ఎన్నికల దిశగా పార్టీల అడుగులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి పెరుగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు, ప్రజా సమస్యలపై చర్చలు, పార్టీ కార్యక్రమాలతో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారుతోంది. రాష్ట్రంలో తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు వివిధ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

అధికార పక్షం.. ప్రతిపక్షాల వ్యూహాలు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలు, హామీల అమలు, ప్రజా సమస్యలపై ప్రశ్నలు సంధిస్తోంది. బీజేపీ కూడా రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలతో పాటు వివిధ అంశాలపై తన రాజకీయ కార్యాచరణను విస్తరిస్తోంది.

స్థానిక ఎన్నికలే రాజకీయ పార్టీలకు పరీక్ష!

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక చర్చగా మారుతున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలపై కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి మొదటి వారంలో ఎన్నికలు జరిగే అవకాశముందని వార్తా కథనాలు వెల్లడించాయి. అయితే అధికారిక ఎన్నికల షెడ్యూల్ వెలువడాల్సి ఉంది.

ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్కంఠ

ఎన్నికల వాతావరణం నేపథ్యంలో వివిధ పార్టీల్లో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. స్థానికంగా ప్రజల్లో గుర్తింపు ఉన్న నాయకులు, పార్టీ కార్యకర్తలు తమ రాజకీయ భవిష్యత్తుపై లెక్కలు వేసుకుంటున్నారు. టికెట్ ఎవరికి దక్కుతుంది? ఏ పార్టీ ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్తుంది? అనే అంశాలు రాజకీయ చర్చలకు కేంద్రంగా మారుతున్నాయి.

హామీలు కాదు.. అభివృద్ధి కావాలి

రాజకీయ పార్టీలు చేసే ప్రకటనలు, హామీల కంటే వాటి అమలుపైనే ప్రజలు దృష్టి సారిస్తున్నారు. నిరుద్యోగ సమస్య, రైతుల ఇబ్బందులు, పెరుగుతున్న నిత్యావసర ధరలు, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్య, వైద్యం వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రజల తీర్పే కీలకం

రాజకీయాల్లో నాయకుల మాటలు, పార్టీల ప్రచారాలు ఎన్ని ఉన్నా చివరకు ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, పాలనలో పారదర్శకతే ప్రజల చర్చలో ప్రధాన అంశాలుగా నిలుస్తాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చారు? ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉన్నారు? అనే అంశాలను ఓటర్లు పరిశీలించే అవకాశం ఉంది.

పోలీసులే కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే
చట్టం ముందు అందరు సమానుమే

- అధికారుల నిర్లక్ష్యానికి హైకోర్టు కఠిన తీర్పు

- పోలీస్ వ్యవస్థకు గట్టి హెచ్చరిక

- తగ్గేదే లేదన్న మాజీ ఎస్‌హెచ్‌ఓ,అధికార దుర్వినియోగానికి కోర్టు చెక్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజ్యాంగం కల్పించిన హక్కులకు,చట్టబద్ధమైన పాలనకు కోర్టులు ప్రధాన రక్షకులుగా ఉంటాయి,ఏ వ్యవస్థ అయినా సక్రమంగా నడవాలంటే అక్కడ న్యాయదేవత తీర్పులు నిష్పక్షపాతంగా ఉండాలి.సామాన్యుడి నుంచి ఉన్నత అధికారుల వరకు చట్టం ముందు అందరూ సమానులే అని కోర్టులు నిరూపిస్తాయి అలాగే ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు చివరిగా ఆశ్రయించేది న్యాయస్థానమే.నేరాలను అరికట్టడానికి,భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణతో సామాన్యులకు రక్షణ కల్పించే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖ మీద ఉంటుంది.సివిల్ లేదా క్రిమినల్ వివాదాలలో కోర్టులు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో పోలీసులు కీలక వారధులుగా ఉండి బాధితులకు న్యాయం జరిగేలా చూడడం వారి కర్తవ్యం. ఏ వ్యవస్థలోనైనా ప్రజల నమ్మకమే ఆ వ్యవస్థకు అసలైన బలముగా మారుతుంది.ఒకవేళ రక్షణ కల్పించాల్సిన పోలీసులే కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే,సమాజంలో వ్యవస్థల పై నమ్మకం సన్నగిల్లుతుంది. చట్టాన్ని అతిక్రమించే ఎవరికైనా, వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదనే నమ్మకాన్ని ఇచ్చేది న్యాయ వ్యవస్థ.

న్యాయస్థానాల తీర్పులు సమాజంలో తప్పు చేసేవారికి ఒక బలమైన హెచ్చరికలా మారుతాయి

కోర్టు,ప్రజలు,పోలీసులు ఒకే నాణేనికి ఉన్న వేర్వేరు ముఖాల లాంటివారు.
ఈ మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పనిచేస్తేనే సమాజంలో ధర్మం నిలబడుతుంది.
ఎవరి పరిధిలో వారు నిజాయితీగా పని
చేసినప్పుడే దేశంలో సుపరిపాలన సాధ్యమవుతుంది.
అంతిమంగా,ఈ వ్యవస్థలన్నీ కలిసికట్టుగా దేశ అభివృద్ధికి,శాంతికి పునాది వేస్తాయి.

ఆదేశాలు పాటించకపోతే ఎవరికైనా శిక్షే..

ఇటీవల తెలంగాణ ఉన్నత న్యాయస్థానం మియాపూర్ పోలీస్ స్టేషన్ అప్పటి ఎస్‌హెచ్‌ఓ ఎం.ప్రేమ్ కుమార్‌కు కోర్టు ధిక్కరణ కేసులో నాలుగు వారాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించడం సమాజంలో తీవ్ర చర్చనీయాంశమైంది. మియాపూర్ గోకుల్ ప్లాట్స్‌లోని 700 చదరపు గజాల వివాదాస్పద స్థలానికి సంబంధించి సివిల్ కోర్టు ఇచ్చిన డిక్రీ ఆధారంగా 2019లో పోలీసు రక్షణ కల్పించాలని హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది అయితే, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయడంలో అప్పటి ఎస్‌హెచ్‌ఓ విఫలం కావడంతో బాధితులు ఏ. శేఖర్‌బాబు మరికొందరు 2023లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి,అధికారి తీరు స్పష్టంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని నిర్ధారిస్తూ ఈ కఠిన శిక్షను ఖరారు చేశారు. ఉన్నత కోర్టులో అప్పీలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ తీర్పు అమలును రెండు వారాల పాటు నిలిపివేసినప్పటికీ,"స్టే"రాని పక్షంలో రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని ఆదేశించారు.ఈ తీర్పు ద్వారా ప్రభుత్వ యంత్రాంగం గానీ,చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీస్ వ్యవస్థ గానీ రాజ్యాంగానికి, న్యాయస్థానాలకు అతీతులు కారని మరోసారి నిరూపితమైంది.ప్రస్తుత సమాజంలో"భూ వివాదాలు",ఆక్రమణలు పెరిగిపోతున్న తరుణంలో బాధితులు తమ ప్రాథమిక హక్కుల రక్షణ కోసం చివరికి న్యాయస్థానాలనే ఆశ్రయిస్తున్నారు.సివిల్ కోర్టులు తీర్పులిచ్చినా,ఉన్నత న్యాయస్థానాలు ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహిస్తే బాధితులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది.రక్షణ కల్పించాల్సిన అధికారులే చట్ట విరుద్ధంగా వ్యవహరించడం లేదా కోర్టు ఉత్తర్వులను తేలికగా తీసుకోవడం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులకే ప్రమాదకరం.ఐదేళ్ల పాటు సుదీర్ఘమైన న్యాయపోరాటం చేసి బాధితులు విజయం సాధించడం,సామాన్య పౌరులలో న్యాయవ్యవస్థ పట్ల ఉన్న నమ్మకాన్ని, ధైర్యాన్ని మరింత పెంచింది.అధికార పీఠాల్లో ఉన్నవారు తమ విధులను



సక్రమంగా నిర్వర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ తీర్పు హెచ్చరిస్తోంది. ఈ ఘటన పోలీసు శాఖ అంతర్గతంగా ఆత్మపరిశీలన చేసుకోవడానికి,విధుల నిర్వహణలో మరింత పారదర్శకతను పెంచుకోవడానికి ఒక మంచి అవకాశంగా మారింది. అధికారులు ఇచ్చే హామీల కంటే,కోర్టులు జారీ చేసే ఉత్తర్వులను గౌరవించి అమలు చేయడమే శాంతిభద్రతల పరిరక్షణకు ఏకైక మార్గం.పౌరులు తమ హక్కుల కోసం చట్టబద్ధమైన మార్గంలో పోరాడితే ఆలస్యమైనప్పటికీ చివరికి విజయం లభిస్తుందని ఈ ఉదంతం ఓ ఉదాహరణ.

పోలింగ్ విధుల్లో విషాదం.. హరిత మృతి

ఓటు వేయించే బాధ్యతలోనే తుదిశ్వాస..

ఉపాధ్యాయురాలి మృతిపై సీఎం

చంద్రబాబు దిగ్భ్రాంతి

అస్వస్థతతో ఆసుపత్రికి తరలింపు..

చికిత్స పొందుతూ కన్నుమూత..

కుటుంబానికి అండగా ఉంటామని

ముఖ్యమంత్రి భరోసా

అనంతపురం(ప్రశ్న న్యూస్) ఎన్నికల విధులు నిర్వహిస్తూనే ప్రాణాలు విడిచిన ఉపాధ్యాయురాలు పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారి అస్వస్థతకు గురై మృత్యువాత పడిన ఘటన విషాదం నింపింది. అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న హరిత (58) శ్వాస సంబంధిత సమస్యతో ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోలింగ్ కేంద్రంలో అస్వస్థత..


అనంతపురం జిల్లా డి.హీరేహాల్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో హరిత సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో భాగంగా కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో ఆమెకు బాధ్యతలు అప్పగించారు.విధులు నిర్వహిస్తున్న సమయంలో హరితకు శ్వాస సంబంధిత సమస్య తలెత్తింది. దీంతో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య బృందం వెంటనే స్పందించి ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది.

చికిత్స పొందుతూ కన్నుమూత..

ఆసుపత్రిలో హరితకు అత్యవసర వైద్య చికిత్స అందించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె మరణించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలి మృతితో విషాదం నెలకొంది.

కుటుంబానికి అండగా సీఎం

హరిత మృతి విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని



తిరుమల కొండకు పాదాల చెంత..

వైకుంఠ వైభవానికి నిలువెత్తు సాక్ష్యం

గోవిందరాజస్వామి ఆలయం.

. భక్తి పారవశ్యానికి నిలయం..

ఆధ్యాత్మిక చింతనకు ఆలయం..

శ్రీవారి దివ్యక్షేత్రంలో అపూర్వ మహిమ..

(ప్రజాప్రశ్న బ్యూరో తోట వెంకట్- తిరుపతి పై ప్రత్యేక కథనం)



గోవిందా.. గోవిందా.. అంటూ మారుమోగే తిరుపతి వీధులు.. భక్తుల హృదయాల్లో భక్తిభావాన్ని నింపే దివ్యనామ స్మరణ.. కొండపై కొలువైన ఏడుకొండల స్వామివారి వైభవానికి పాదాల చెంత మరో మహిమాన్విత ఆలయం.. అదే శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ.. శతాబ్దాల చరిత్రను తనలో నిక్షిప్తం చేసుకుంటూ.. భక్తుల కోరికలకు కొంగుబంగారంగా వెలుగొందుతున్న ఈ దివ్యక్షేత్రం తిరుపతి ఆధ్యాత్మిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

తిరుపతి ఆధ్యాత్మిక వైభవానికి మరో రూపం..

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. కొండపై శ్రీవారి దర్శనం చేసుకున్న అనంతరం తిరుపతి నగరంలో ఉన్న శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయాన్ని దర్శించుకోవడం అనేకమంది భక్తుల ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా మారింది. తిరుపతి నగర నడిబొడ్డున వెలసిన ఈ ఆలయం భక్తి, విశ్వాసం, సంప్రదాయం, ఆధ్యాత్మిక చింతనల సమ్మేళనంగా నిలుస్తోంది.

గోవిందరాజస్వామివారి ఆలయం కేవలం ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు. తిరుపతి నగర ఆధ్యాత్మిక జీవనానికి కేంద్రబిందువు. నిత్యం స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా కనిపిస్తాయి. స్వామివారి సన్నిధిలో అడుగుపెట్టగానే భక్తుల మనసుల్లో ఒక ప్రశాంతత ఆవహిస్తుంది. గంటల ధ్వని, వేదమంత్రాల నినాదం, భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది.

శ్రీ గోవిందరాజస్వామివారి మహిమ.. అపురూపమైన వైష్ణవ సంప్రదాయం..

శ్రీ గోవిందరాజస్వామివారు శ్రీ మహావిష్ణువు అవతార స్వరూపంగా భక్తులచే పూజలందుకుంటున్నారు. వైష్ణవ సంప్రదాయంలో ఈ ఆలయానికి విశిష్టమైన స్థానం ఉంది. స్వామివారి శయనమూర్తి రూపం భక్తులకు దర్శనమిస్తూ, సృష్టి స్థితి లయలకు మూలమైన పరమాత్మ తత్వాన్ని గుర్తుచేస్తుంది.

ఆలయంలో స్వామివారి శయన రూపం భక్తుల మనసులను ఆకట్టుకుంటుంది. అనంతమైన విశ్వాన్ని తనలో నిక్షిప్తం చేసుకున్న పరమాత్మ విశ్రాంతి తీసుకుంటున్న దివ్య స్వరూపంగా భక్తులు స్వామివారిని భావిస్తారు. ఆ రూపాన్ని దర్శించుకున్నప్పుడు భక్తుల హృదయాల్లో భగవంతుని పట్ల ప్రేమ, విశ్వాసం మరింత బలపడతాయి.స్వామివారి సన్నిధిలో నిలబడి ప్రార్థించే భక్తులు తమ కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, సంతానం, విద్య, ఉద్యోగం, ఆర్థిక అభివృద్ధి వంటి అనేక కోరికలను సమర్పిస్తారు. అయితే భగవంతుని దర్శనం అనేది కోరికల సాధనకు మాత్రమే పరిమితం కాకుండా, మనిషి అంతరంగాన్ని పరిశుద్ధం చేసుకునే ఆధ్యాత్మిక ప్రయాణంగా కూడా భావించబడుతుంది.

శతాబ్దాల చరిత్ర.. శిల్పకళలో దాగిన ఆధ్యాత్మిక సందేశం..

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయ చరిత్ర తిరుపతి ఆధ్యాత్మిక చరిత్రతో విడదీయలేనిది. ఈ ఆలయ నిర్మాణం, విస్తరణ, పూజా సంప్రదాయాలు వివిధ కాలాల్లో రాజులు, పాలకులు, భక్తులు అందించిన సేవలతో అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా వైష్ణవ ఆచార్యుల సంప్రదాయం ఈ క్షేత్రానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని మరింత పెంచింది.ఆలయ నిర్మాణంలో కనిపించే గోపురాలు, మండపాలు, శిల్పాలు దక్షిణ భారత దేవాలయ నిర్మాణ సంప్రదాయానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ప్రతి నిర్మాణ భాగం వెనుక ఒక కళాత్మక ఆలోచన, ఒక ఆధ్యాత్మిక భావన దాగి ఉంటుంది. గోపురం భక్తులకు దూరం నుంచే దర్శనమిస్తూ, ఆలయానికి దారి చూపించే ఆధ్యాత్మిక సంకేతంగా నిలుస్తుంది.ఆలయ ప్రాంగణంలో కనిపించే శిల్పకళా వైభవం మన పూర్వీకుల కళా నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. రాతిపై చెక్కిన రూపాలు, మండపాల నిర్మాణం, ఆలయ ప్రాకారాలు భక్తుల్లో భారతీయ సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంచుతాయి. ఆలయాన్ని దర్శించుకోవడం ద్వారా భక్తులు కేవలం దేవుడిని మాత్రమే కాకుండా, మన దేశపు గొప్ప చరిత్రను కూడా అనుభవిస్తారు.

గోవిందరాజస్వామివారి దర్శనం.. మనసుకు ప్రశాంతత...

ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఆధ్యాత్మిక ప్రశాంతత కోసం దేవాలయాలను ఆశ్రయిస్తారు. తిరుపతిలోని గోవిందరాజస్వామివారి ఆలయం అలాంటి ప్రశాంతతను అందించే పవిత్ర ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది.

ఆలయంలోకి ప్రవేశించినప్పుడు భక్తుల మనసుల్లో ఉన్న ఆందోళనలు క్రమంగా తగ్గిపోతాయని అనేకమంది భావిస్తారు. స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుంటూ, కొంతసేపు భగవంతుని స్మరణలో గడపడం ద్వారా మనిషి తన జీవితంలోని సమస్యలను ప్రశాంతంగా ఆలోచించగలుగుతాడు.

భక్తి అనేది మనిషికి ధైర్యాన్ని ఇచ్చే శక్తి. కష్టకాలంలో భగవంతుని స్మరించుకోవడం ద్వారా మనసులో ఆశ కలుగుతుంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ఆధ్యాత్మిక విశ్వాసం ఒక మానసిక బలంగా నిలుస్తుంది.

గోవిందరాజస్వామివారి ఆలయంలో భక్తులు చేసే ప్రార్థనలు వారి వ్యక్తిగత విశ్వాసాలకు ప్రతిబింబంగా నిలుస్తాయి. కొందరు స్వామివారిని కుటుంబ దేవుడిగా భావిస్తారు. మరికొందరు తమ జీవితంలో ఎదురైన



కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఉత్సవాలు అనేవి కేవలం ఆచారాలు మాత్రమే కాదు. అవి మన సంస్కృతి, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందించే గొప్ప అవకాశాలు. దేవాలయాల్లో జరిగే ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి. భక్తులందరూ ఒకే ఆధ్యాత్మిక భావనతో కలిసివస్తారు.

భక్తుల విశ్వాసమే ఆలయానికి అసలైన వైభవం..

ఏ దేవాలయమైనా దాని గొప్పతనం కేవలం నిర్మాణ వైభవంలోనే ఉండదు. అక్కడికి వచ్చే భక్తుల విశ్వాసం, వారి ఆధ్యాత్మిక అనుబంధం,



ఆధ్యాత్మికత అంటే ప్రపంచానికి దూరంగా ఉండటం కాదు. మన జీవితంలో ధర్మాన్ని ఆచరించడం, కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడం, సమాజానికి సేవ చేయడం కూడా ఆధ్యాత్మికతలో భాగమే.

గోవిందరాజస్వామివారి సన్నిధిలో భక్తులు చేసే ప్రార్థనలు ఈ విలువలను గుర్తుచేస్తాయి. స్వామివారి దివ్యమంగళ రూపం భక్తుల హృదయాల్లో విశ్వాసాన్ని నింపుతుంది.

తిరుపతి ఆధ్యాత్మిక చరిత్రలో చిరస్థాయిగా..

తిరుపతి నగరం ప్రపంచవ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంగా



కష్టాల నుంచి బయటపడేందుకు స్వామివారి ఆశీస్సులు కోరుకుంటారు. ఇంకొందరు ఎలాంటి కోరికలు లేకుండా భగవంతుని దర్శించుకోవడమే పరమానందంగా భావిస్తారు.

నిత్యపూజలు.. ఆగమ సంప్రదాయాలకు ప్రతీక..

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో నిత్యపూజలు, అర్చనలు, ఉత్సవాలు వైష్ణవ సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించబడుతుంటాయి. ఆలయ పూజా విధానాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి.

స్వామివారికి నిర్వహించే పూజలు, నైవేద్యాలు, హారతులు భక్తులకు దివ్యమైన అనుభూతిని కలిగిస్తాయి. పూజా సమయంలో వినిపించే వేదమంత్రాలు, శంఖనాదం, గంటల ధ్వని ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణాన్ని నింపుతాయి.

ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలు భక్తులకు దేవుని పట్ల తమకున్న అనుబంధాన్ని వ్యక్తపరచడానికి ఒక మార్గంగా నిలుస్తాయి. భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం ద్వారా తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు.

పిల్లలకు దేవాలయ దర్శనం ఒక మంచి సంస్కారాన్ని అందిస్తుంది. పెద్దలు స్వామివారి మహిమను వివరించడం ద్వారా పిల్లల్లో భక్తి, వినయం, సేవాభావం వంటి విలువలు పెంపొందుతాయి. దేవాలయం ఒక ఆధ్యాత్మిక పాఠశాలగా కూడా పనిచేస్తుంది.

తిరుమల శ్రీవారితో ఆధ్యాత్మిక అనుబంధం..

తిరుపతి నగరంలో ఉన్న గోవిందరాజస్వామివారి ఆలయానికి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంతో విడదీయలేని ఆధ్యాత్మిక సంబంధం ఉంది. తిరుమల కొండపై శ్రీవారిని దర్శించుకునే భక్తులు తిరుపతిలోని గోవిందరాజస్వామివారిని దర్శించుకోవడం ద్వారా తమ యాత్రను మరింత పరిపూర్ణంగా భావిస్తారు.శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు తిరుపతి నగరంలోని వివిధ ఆలయాలు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి. గోవిందరాజస్వామివారి ఆలయం ఈ క్షేత్ర సంప్రదాయంలో ప్రధానమైనది.

తిరుమలలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామివారు భక్తులకు కలియుగ ప్రత్యక్ష దైవంగా ప్రసిద్ధి చెందగా, తిరుపతిలోని గోవిందరాజస్వామివారు వైష్ణవ భక్తి సంప్రదాయానికి విశిష్టమైన ప్రతీకగా నిలుస్తున్నారు.

ఈ రెండు క్షేత్రాల దర్శనం భక్తులకు శ్రీ మహావిష్ణువు పట్ల ఉన్న విశ్వాసాన్ని మరింత బలపరుస్తుంది. భక్తులు తమ యాత్రలో ఈ ఆలయాలను దర్శించుకోవడం ద్వారా ఆధ్యాత్మిక సంపూర్ణతను అనుభవిస్తారు.

ఉత్సవాల వైభవం.. భక్తి సాగరంలో తిరుపతి...

గోవిందరాజస్వామివారి ఆలయంలో నిర్వహించే ఉత్సవాలు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పర్వదినాలు, వైష్ణవ సంప్రదాయాలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు ఆలయ ప్రాంగణంలో భక్తి ఉత్సాహాన్ని నింపుతాయి.

ఉత్సవాల సమయంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడుతాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ, తమ కుటుంబ సభ్యులతో కలిసి పూజా తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాల్లోనే నిజమైన మహిమ ఉంటుంది.

గోవిందరాజస్వామివారి ఆలయం కూడా అలాంటి విశ్వాసానికి ప్రతీకగా



నిలుస్తోంది. ప్రతి రోజు స్వామివారిని దర్శించుకునే భక్తుల హృదయాల్లో భగవంతుని పట్ల ఉన్న ప్రేమ ఈ ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచుతోంది.

ఒక భక్తుడు స్వామివారి సన్నిధిలో నిలబడి ప్రార్థించినప్పుడు, తన జీవితంలోని బాధలను భగవంతునికి సమర్పిస్తున్నాననే భావన కలుగుతుంది. మరొక భక్తుడు స్వామివారి దర్శనంతో తన కుటుంబానికి మేలు జరుగుతుందని విశ్వసిస్తాడు. ఇంకొకరు భగవంతుని దర్శనం ద్వారా తన మనసుకు ప్రశాంతత లభిస్తుందని భావిస్తారు.

ఈ విశ్వాసాలన్నీ కలిసే దేవాలయాన్ని ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిపివేస్తాయి.

ఆధ్యాత్మిక సందేశం.. జీవితానికి వెలుగుబాట..

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం భక్తులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. భగవంతుని పట్ల విశ్వాసం కలిగి ఉండటం, ఇతరుల పట్ల ప్రేమ చూపించడం, జీవితంలో ధర్మాన్ని పాటించడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వంటి విలువలు మనిషిని ఉన్నత స్థితికి తీసుకెళ్తాయి.

దేవాలయ దర్శనం ద్వారా మనిషి తనలోని అహంకారాన్ని తగ్గించుకోవాలి. ఇతరుల పట్ల దయ, కరుణ, సహనం పెంపొందించుకోవాలి. భగవంతుని స్మరణ మనిషిని మంచి మార్గంలో నడిపించాలి.

ప్రసిద్ధి చెందింది. ఈ నగరంలోని గోవిందరాజస్వామివారి ఆలయం ఆ ఆధ్యాత్మిక వైభవానికి మరో ముఖ్యమైన ప్రతీక.

శతాబ్దాలుగా కొనసాగుతున్న పూజా సంప్రదాయాలు, ఆలయ నిర్మాణ వైభవం, భక్తుల విశ్వాసం ఈ క్షేత్రాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఎప్పుడూ ఆధ్యాత్మిక సందడిని కలిగి ఉంటుంది.

స్వామివారి దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తుడు తన హృదయంలో ఒక ప్రత్యేకమైన అనుభూతిని తీసుకెళ్తాడు. ఆ అనుభూతి కొందరికి ఆనందం, మరికొందరికి ప్రశాంతత, ఇంకొందరికి ధైర్యం రూపంలో ఉంటుంది.

గోవిందరాజస్వామివారి ఆలయం.. భక్తి భావానికి నిలయం.. వైష్ణవ సంప్రదాయానికి ప్రతీక.. తిరుపతి ఆధ్యాత్మిక వైభవానికి చిరస్మరణీయమైన చిరునామా!

గోవిందా.. గోవిందా.. అంటూ స్వామివారిని స్మరించే ప్రతి భక్తుడి హృదయంలో ఈ దివ్యక్షేత్రం విశ్వాసపు వెలుగును నింపుతోంది. తిరుమల కొండల ఆధ్యాత్మిక మహిమకు పాదాల చెంత నిలిచిన ఈ ఆలయం భక్తి, ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా తరతరాలకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తోంది. స్వామివారి దివ్యదర్శనం.. భక్తుల హృదయాల్లో ఆనందం.. తిరుపతి ఆధ్యాత్మిక వైభవంలో గోవిందరాజస్వామివారి ఆలయం ఒక అపూర్వమైన దివ్యధామం!

బీజేపీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా

బోయిని నారాయణ నియామకం



మంథని,(ప్రశ్న న్యూస్) బీజేపీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా మంథని నియోజకవర్గానికి చెందిన బోయిని నారాయణ నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు శాతరాజు రమేష్ ఆయనను ఈ పదవికి శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా బోయిని నారాయణ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గందమల్ల ఆనంద్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కొండపాక సత్యప్రకాష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు శాతరాజు రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు మొలుమూరి శ్రీనివాస్, మంథని నియోజకవర్గ బీజేపీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మంథని నియోజకవర్గంలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సి.సి రోడ్డు, అండర్‌డ్రైనేజీ నిర్మాణం పనులను ప్రారంభించిన ఎంఎల్ఏ సబితారెడ్డి

బడంగ్‌పేట్ (ప్రశ్న న్యూస్) బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలోని సబితా ఇంద్రారెడ్డి కాలనీ పేస్ 2 లో కొత్త సి.సి రోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులకు మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, రహదారి సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. సి సి రోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. సి.సి రోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనుల భూమిపూజ చేసేందుకు తమ కాలనీకి వచ్చిన ఎంఎల్ఏ సబితారెడ్డికి కాలనీ అధ్యక్షుడు రాజుచారి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రాజుచారి మాట్లాడుతు ఈ రోజు ఒక చరిత్రాత్మకమైన రోజని, తమ కాలనీ అభివృద్ధికి ఎంతగానో సహకరించి, అడిగిందే తడువుగా దయతో అనుమతించి సి.సి రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించే క్రమంలో భూమిపూజ చేసేందుకు తమ కాలనీకి వచ్చిన ఎంఎల్ఏ, సబితమ్మకు కాలనీవాసుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ







కార్యక్రమంలో శేఖర్ గౌడ్, రాములు, ఆంజనేయులు, భూతరాజు నర్సింహులు, నూకరాజు, వెంకటయ్య, జంగారెడ్డి, రాజుగౌడ్, రఘుచారి, క్రిష్ణ, నెరెడ్డి నర్సింహ్మ, యాదగిరి, మల్లారెడ్డి, రామారావు, విక్రమ్‌సింగ్, బలరాం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన రోగ నిర్ధారణకు మెడిసిటీలో ఆధునిక ల్యాబ్ పరికరాలు

రోగులకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యంగా యాజమాన్యం చర్యలు





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా ఘనపూర్ లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేడ్చల్ హాస్పిటల్ సెంట్రల్ లేబొరేటరీలో రోగులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన వైద్య నిర్ధారణ సేవలు అందించాలనే లక్ష్యంతో యాజమాన్యం పలు ఆధునిక పరికరాలను ఎప్పటికపుడు రోగులకు అందుబాటులోనికి తీసుకొని వస్తోంది. ఈ కోవలోనే అత్యాధునిక బెక్మెన్ కల్టర్ డస్ 500ఱ ఇంటిగ్రాటెడ్ క్లినికల్ కెమిస్ట్రీ అండ్ ఇమ్యూనోస్సయ్ సిస్టం యంత్రాన్ని మెడిసిటి హాస్పిటల్ ఘన్ పూర్ లో నూతనంగా ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రఖ్యాత బెక్మెన్ కంపెనీ ఈ మెడిసిటీ సెంట్రల్ ల్యాబ్ లో అమర్చింది. దీంతో పాటూ ల్యాబొరేటరీలోని హెమటాలజీ విభాగంలో ఆటోలోడర్ సదుపాయంతో కూడిన సెల్ కౌంటర్లను, హెచ్ బి ఏ 1సి పరీక్షల కోసం అత్యాధునిక హపాల్సీ (హై పెర్ఫార్మన్స్ లిక్విడ్ క్రోమటోగ్రఫీ) గోల్డ్ స్టాండర్డ్ ఎనాలిజర్ యెంత్రాన్ని ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటికే సెంట్రల్ లేబొరేటరీలో పూర్తిస్థాయి ఆటోమేటెడ్ అనలైజర్లు అందుబాటులో ఉన్నప్పటికీ, రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్య, పరీక్షల అవసరాలు సకాలంలో రిపోర్టులు అందించాల్సిన ఆవశ్యకత, రోగుల కు త్వరితగతిన సేవలు అందించాలనే సదుద్దేశం తో యాజమాన్యం అదనంగా మరిన్ని ఆధునిక పరికరాలను సమకూర్చింది. ఈ నూతన పరికరాల ద్వారా బయోకెమిస్ట్రీ, ఇమ్యునోఅస్సే, హెమటాలజీ మరియు హెచ్ బి ఏ 1సి విభాగాల్లో పరీక్షల నిర్వహణ సామర్థ్యం మరింత పెరగడంతో పాటు, పరీక్షల ఫలితాలను వేగంగా, నాణ్యతతో అందించడానికి అవకాశం కలుగుతుంది. ఒక గంటలో 400 శాంపిల్స్ ను ఈ యంత్రం పరీక్షించ గలుగుతుంది . ఈ యంత్రం పూర్తిగా ఆటో మెటిక్ గా పనిచేస్తుంది, తద్వారా ఖచ్చితమైన రోగ నిర్ధారణకు, వైద్యులు సరైన చికిత్స అందించడానికి మరింత తోడ్పాటు లభిస్తుంది. నేటి ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రొఫెసర్, ప్రెసిడెంట్ కె. శివరామకృష్ణ, వీటిని లాంఛనంగా ప్రారంభించి రోగులకు అందుబాటులోనికి తెచ్చారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె శివరామకృష్ణ మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న రోగుల అవసరాలను తీర్చడంతో పాటూ అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్ష వ్యవస్థలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో హాస్పిటల్ పని చేస్తోందని చెప్పారు. నేడు ఏర్పాటు చేసిన యంత్రాల తో వ్యాధి నిర్ధారణ ఫలితాలను త్వరగా అందించడానికి వీలవుతుందని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని ఆదునిక చికిత్స వ్యవస్థలను రోగుల కోసం తీసుకొని రావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నూతన సదుపాయాలు రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు వేగంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను సమకూర్చిన హాస్పిటల్ యాజమాన్యానికి సెంట్రల్ లేబొరేటరీ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ డా. సి. గీత, డైరెక్టర్, మెడికల్ అడ్మినిస్ట్రేషన్, ఎం ఐ ఎం ఎస్ ఎంఐఎంఎస్ ప్రిన్సిపల్ డా. దేవేంద్ర సింగ్ నేగి, డా. స్వప్న, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి, ఎంఐఎంఎస్ లతో పాటూ హెమటాలజీ, మైక్రోబయాలజీ విభాగాల వైద్యులు, సెంట్రల్ లేబొరేటరీ ఇన్‌ఛార్జ్ డా. పి. యల్లేష్, సెంట్రల్ లేబొరేటరీ అసిస్టెంట్ మేనేజర్ ఏ. ప్రభాకర్, ఇతర వైద్యులు , వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధన్వంతరి జయంతి

ఆయుర్వేద పరంపర పరిరక్షణకు తెలుసుకోవాల్సిన ముఖ్య అంశాలు





ఆరోగ్యమే మహాభాగ్యం అన్నది తరతరాల భారతీయ జీవన నానుడిప్రకృతి ప్రసాదించిన అమూల్య వనరులను సద్వినియోగం చేసుకుంటూ దేహాన్ని దేవాలయంగా మలచుకోవడమే ప్రాచీన వైద్య విధానాల అంతస్సూత్రంఈ నేలపై వెలసిన సమస్త జీవకోటికి ఆయువు పోస్తూ ఆరోగ్యానికి ఆదిదేవుడిగా ఆయుర్వేదానికి ఆదిగురువుగా నిలిచిన దివ్య చైతన్య స్వరూపమే శ్రీ ధన్వంతరి భగవానుడు ఆశ్వయుజ బహుళ త్రయోదశి పుణ్యదినాన లోకానికి ప్రాణదాతగా అవతరించిన ఆ జగద్గురువు జయంతిని పురస్కరించుకుని భారతీయ సమాజం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకుంటోంది. పురాణ ప్రశస్తమైన క్షీరసాగర మథన వేళ సమస్త లోకాలను పట్టిపీడిస్తున్న రోగ భయాలను పారద్రోలేందుకు శ్రీమహావిష్ణువు అంశగా ధన్వంతరి ఆవిర్భవించారు. చేత అమృత కలశాన్ని ధరించి అవతరించిన ఆ దేవవైద్యుడు మానవాళి మనుగడకు కావలసిన ప్రకృతి రహస్యాలను మూలికా విజ్ఞానాన్ని లోకానికి అందించారు. సురాసురుల చేత వందనాలందుకుంటూ ముసలితనం రోగం భయం మరణం వంటి సమస్త ఆందోళనలను పారద్రోలే ఆదిదేవుడిగా స్తోత్రాలు ఆ దేవదేవుడిని కీర్తిస్తున్నాయి. ధన్వంతరి అనేది కేవలం ఒక పూజా రూపం మాత్రమే కాదు అది ప్రకృతినీ పర్యావరణాన్నీ గౌరవిస్తూ జీవించే మహోన్నత ఆరోగ్య సంస్కృతికి ప్రతీక ఆహార నియమాలు దినచర్య రుతుచర్య మూలికల ఉపయోగాలు అనే సమగ్ర జీవన విధానాన్ని అందించిన ఆ మూలపురుషుడికి సమాజం సమర్పించే నిజమైన నివేదన ఏమిటంటే ఆయన అందించిన ఆయుర్వేద వారసత్వాన్ని కాపాడుకోవడమే

నేటి కాలంలో అడవులు తరిగిపోతున్నాయి

పట్టణీకరణ పర్యావరణ కాలుష్యం పెరిగిపోవడంతో అనేక ఔషధ మొక్కలు కనుమరుగవుతున్నాయి.

తరతరాలుగా మన పూర్వీకులు రక్షించుకుంటూ వచ్చిన అమూల్య మూలికా సంపద అంతరించిపోయే ప్రమాదపు అంచున నిలిచింది.

ఈ సంక్షోభాన్ని గుర్తించి పూర్వీకుల వైద్య సంప్రదాయాన్ని బ్రతికించే లక్ష్యంతో ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం దృఢ సంకల్పంతో ముందడుగు వేసింది.

అడవుల్లోనూ కొండల్లోనూ వెతికి తెచ్చుకునే పరిస్థితి నుంచి ప్రతి ఇంట్లోనూ ఔషధ మొక్కలను పెంచుకునే సంస్కృతిని సమాజంలో పాదుగొల్పడమే ఈ ఉద్యమ ప్రధాన ఆశయం

ఔషధ సంపదను పెకిలించి నాశనం చేయడం కాకుండా వాటిని కంటికి రెప్పలా కాపాడుకునే చేతులు సమాజంలో పెరగాలి.

ఈ దిశగా సంఘం స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందుకు తెస్తోంది

స్థానికంగా అంతరించిపోతున్న అరుదైన వృక్షజాతులను గుర్తించి వాటి విత్తనాలను నర్సరీల ద్వారా అందుబాటులోకి తేవడం మొదటి అడుగు మొక్కను సమూలంగా నరికేయకుండా ఆకులు పువ్వులు కాయలు గింజలను శాస్త్రీయంగా సేకరించే సుస్థిర విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం మరో ముందడుగు తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ మూలికా వైద్యుల అనుభవ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయ పరిశోధనలతో అనుసంధానించి ప్రజలకు నాణ్యమైన సురక్షితమైన వైద్య ఫలాలను అందించాల్సిన అవసరం ఉంది

ప్రభుత్వ యంత్రాంగాలు అటవీ జీవవైవిధ్య విద్యా సంస్థల సమన్వయంతో గ్రామ స్థాయి మూలికా వనాలను అభివృద్ధి చేయాలని సంఘం సంకల్పిస్తోంది.

ప్రతి ఇంటికి పది ఔషధ మొక్కలు
ప్రతి గ్రామానికి ఒక ఔషధ వనం
ప్రతి ప్రాంతానికి ఒక మూలికా నర్సరీ
ప్రతి మనిషిలో సమగ్ర ఆరోగ్య స్పృహ

తులసి వేప ఉసిరి తిప్పతీగ అశ్వగంధ నేలవేము వావిలి వంటి దివ్య మూలికలు ప్రతి ఇంటి ముంగిట ఉంటే కుటుంబ ఆరోగ్యం భద్రంగా ఉంటుంది

ఔషధ మొక్కను నాటడం అంటే కేవలం పచ్చదనాన్ని పెంచడం మాత్రమే కాదు

ఒక ప్రాచీన వైద్య విజ్ఞానాన్ని రక్షించడం

జాతి సంపదను కాపాడటం

భావితరాల ఆరోగ్య భద్రతకు బాటలు వేయడం.

ధన్వంతరి జయంతి పర్వదినాన ఆ మూలపురుషుడి పాదపద్మాలకు సమర్పించే అసలైన పూజ ప్రకృతిని ఆరాధించడమేఆధునిక జీవనశైలి తెచ్చిపెడుతున్న రుగ్మతలను అధిగమించడానికి ప్రాచీన ఆయుర్వేద సూత్రాలను నిత్య జీవితంలో అలవర్చుకోవాలి. అర్హత కలిగిన వైద్యుల మార్గదర్శకత్వంలోనే మూలికా ఔషధాలను వినియోగించాలి. సమస్త లోకం రోగాల బారిన పడకుండా ఆనందంగా వర్ధిల్లాలన్న ఆర్యోక్తిని నిజం చేస్తూ ప్రకృతితో సమన్వయమైన జీవనాన్ని సాగిద్దాం ధన్వంతరి చూపిన బాటలో ఆరోగ్యకర నవసమాజ నిర్మాణానికి సమష్టిగా కంకణబద్ధులవుదాం

రచన
సింహాచలం లక్ష్మణ స్వామి
వ్యవస్థాపక అధ్యక్షులు
ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం
ఫోన్ నంబర్ 9000187858

ఇందిరమ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం

పేదవాడి సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం

పూడూర్ కిష్టాపూర్ 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



రొయ్యపల్లి మల్లేష్ గౌడ్

మేడ్చల్(ప్రశ్న న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని 298 పూడూర్ కిష్టాపూర్ డివిజన్ పరిధి లోని కిష్టాపూర్ వాస్తవ్యులు పి. రామేశ్వరి భిక్షపతి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డివిజన్ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ చేతుల మీదగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకరంలో మాజీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఉద్దండాపురం సత్యనారాయణ నాయకులు రవీందర్ రెడ్డి, శేఖర్ గౌడ్ ధాత్రిక లింగం,నరేందర్, రంజిత్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిష్టాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పేదల సొంతిల్లు కల కాంగ్రెస్ వారి ఇళ్లలో సంతోషాన్ని నింపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని,ప్రజల ఆశీస్సులతో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల ఎమ్మార్వో పాండు నాయక్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు రాము,మాజీ సభ్యులు నయిం,నరేష్,దుర్గ రవి తదితరులు తెలిపారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ-ఎమ్మెల్యే శ్రీ గణేష్

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ మండలానికి చెందిన 12 మంది అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వయంగా ఆయన అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడు పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సిఎంరేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా పారదర్శకంగా కృషి చేస్తున్నామని తెలిపారు.

ప్రతి తల్లిదండ్రులకు తమ ఆడబిడ్డల వివాహం అత్యంత కీలకమైన బాధ్యత అని,ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ కుటుంబము ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వివాహ సమయాల్లో పేద కుటుంబాలకు ఈ పథకాలు ఆర్థికంగా కొండంత భరోసానిస్తున్నాయని, ఆడబిడ్డల తల్లిదండ్రులకు చేయూతనిస్తూ



మోపిదేవి ఆలయంలో అన్నప్రసాదం అవస్థలు

- భక్తులకు కనీస సౌకర్యాలు కరువు, నిత్యాన్నదానంలో నాణ్యత ఏదీ.?
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలకు నడక ప్రయాసలు, కూర్చునేందుకు సరైన ఏర్పాట్లు కరువు
- పక్క రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులకు ప్రభుత్వ ఇచ్చే సౌకర్యాలు ఇంతేనా.?
- ఈవో పర్యవేక్షణ ఏమైంది.? దేవాదాయ శాఖ కమిషనర్, మంత్రి స్పందించరా.?






విజయవాడ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మోపిదేవి ఆలయానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఆలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ముఖ్యంగా నిత్యాన్నదాన సత్రంలో భోజన ఏర్పాట్లు, అన్నప్రసాదం నాణ్యత, భక్తులు కూర్చునే సదుపాయాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కూర్చునే సౌకర్యం లేక అవస్థలు

అన్నప్రసాదం స్వీకరించేందుకు వచ్చే భక్తులకు సరైన వసతి, కూర్చునే సౌకర్యాలు లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ దర్శన ప్రాంతానికి, అన్నదాన సత్రానికి మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో నడవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు అవస్థలు పడుతున్నారు. కనీసం వీరికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న ఆలోచన కూడా అధికారులకు లేదా.? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దానికి తోడు ఇతరులు భోజనం చేసిన తర్వాత ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయకుండా అలాగే వదిలివేయడంతో వేరే భక్తులు అక్కడ కూర్చుని తినే పరిస్థితి లేకపోవడం బాధాకరమని శుభపరిచే సిబ్బంది ఉన్నారా లేరా అన్నది ఒకే తెలవాలని భక్తులు మండిపడుతున్నారు.



అన్నం పేరుతో నాణ్యత లేని భోజనం

నిత్యాన్నదాన సత్రంలో అందిస్తున్న అన్నప్రసాదం నాణ్యతపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు బియ్యంతో అన్నం వడ్డించడమే కాకుండా, వాటిని పూర్తిస్థాయిలో మెత్తగా ఉడికించకుండా అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూరల రుచి కూడా అంతంతమాత్రంగానే ఉంటోందని, పేరుకు నిత్యాన్నదాన సత్రం నిర్వహిస్తున్నప్పటికీ భోజనంలో రుచీపచీ లేదని భక్తులు విమర్శిస్తున్నారు. పప్పు, కూరలు, ఇతర వంటకాల నాణ్యతను పెంచి భక్తులకు తృప్తికరమైన భోజనం అందించాలని కోరుతున్నారు.

సమయం దాటితే అన్నప్రసాదం దొరకదా.?

స్వామివారి దర్శనానికి రద్దీ ఎక్కువగా ఉండటంతో కొంతమంది భక్తులకు దర్శనం పూర్తయ్యేసరికి ఆలస్యం అవుతోంది. అయితే అన్నదాన సత్రంలో భోజన సమయాన్ని పరిమితం చేయడంతో ఆలస్యంగా వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. ఇతర రాష్ట్రాలతో పాటు, దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు కనీసం ప్రత్యామ్నాయంగా భోజనం అందించే ఏర్పాట్లు చేయలేరా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేవాదాయ శాఖలో ఉన్నత అధికారుల నిర్లక్ష్యంతోనే ఆంధ్రప్రదేశ్లో ఉన్న అనేక దేవాలయాల నిర్వహణ రోజురోజుకు అత్యంత అధ్వానంగా మారుతుందని కేవలం భక్తుల కానుకలపై ఆదాయంపై ఉన్న శ్రద్ధ భక్తులకు అందించే సౌకర్యాలపై అన్న ప్రసాదం పై లేకపోవడం హిందూ ధర్మానికి వ్యతిరేకం కాదా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఈవో పర్యవేక్షణ ఎక్కడ.?

భారతదేశంలోనే ఇంతటి ప్రసిద్ధ ఆలయంలో అన్నదాన నిర్వహణ, భోజన నాణ్యత, భక్తుల సౌకర్యాలపై ఆలయ ఈవో నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. కానీ భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై చర్యలు ఎక్కడ.? అన్నదాన సత్రాన్ని అధికారులు ఎప్పుడైనా స్వయంగా పరిశీలిస్తున్నారా.? ప్రతిరోజు అక్కడ అన్న ప్రసాదం తింటున్నారా.? తింటే భక్తులకు అందుతున్న ఆహార నాణ్యత దొడ్డు బియ్యం సమస్య, అపరిశుభ్ర వాతావరణం, రుచి పరిస్థితి తెలిసేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్, మంత్రి ఈ సమస్యలను పట్టించుకోవడం లేదా.? అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా విజయవాడ-మోపిదేవి కరకట్ట రోడ్డు

మరోవైపు విజయవాడ నుంచి మోపిదేవి ఆలయానికి వెళ్లే కరకట్ట రహదారి పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆలయానికి చేరుకునే మార్గంలోనే ఇబ్బందులు ఎదురవుతుండగా, చేరుకున్న తర్వాత అన్నప్రసాదం, రూమ్ ల, ఇతర సౌకర్యాల కోసం అవస్థలు పడాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా దేవాదాయ శాఖ కమిషనర్, మంత్రి, ఆలయ అధికారులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అన్నప్రసాదం నాణ్యతను మెరుగుపరచాలని, సన్న బియ్యం, రుచికరమైన వంటలు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, అన్నదాన సమయాన్ని భక్తులకు అనుకూలంగా పొడిగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భక్తుల విశ్వాసంతో నడిచే పుణ్యక్షేత్రంలో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతే నిత్యాన్నదాన నిర్వహణకు అర్థమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ఓటు వేయడంలోనూ సామాన్యురాలే..
హోంమంత్రి అనిత

హోదా పక్కనపెట్టి క్యూలో నిలిచిన మంత్రి.

ప్రజాస్వామ్యంపై ఓటర్లకు పిలుపు..

నక్కపల్లిలో ఓటు.. ఉపమాకలో పోలింగ్ పరిశీలన..





నక్కపల్లి(ప్రశ్న న్యూస్) హోదా ఉన్నా.. ఓటు ముందు అందరూ సమానమే రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నక్కపల్లిలో సాధారణ ఓటరుగా క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి హోదాను పక్కనపెట్టి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన ఆమె.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 209వ పోలింగ్ బూత్‌లో హోంమంత్రి అనిత ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత పవిత్రమైన హక్కని, దానిని నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు కీలకమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి బలమని పేర్కొంటూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు.

పోలింగ్ సరళిపై ఆరా..

ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం హోంమంత్రి అనిత ఉపమాక గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించి సరళిపై ఆరా తీశారు. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్ 2026 ఫలితాలు విడుదల

- ఇంటర్వ్యూలకు 2,526 మంది అర్హత



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సివిల్ సర్వీసెస్ (మెయిన్) ఎగ్జామినేషన్ 2026 ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) గురువారం (నవంబర్ 5) ప్రకటించింది. ఈ ఫలితాల్లో మొత్తం 2,526 మంది అభ్యర్థులు తదుపరి దశ అయిన పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించినట్లు యూపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది.ఈ ఏడాది ఆగస్టు 21, 22, 23, 29, 30 తేదీల్లో యూపీఎస్సీ ఈ మెయిన్స్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. అంతకుముందు జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన 13,343 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు హాజరయ్యారు. మొత్తం 1,016 సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీ లక్ష్యంగా యూపీఎస్సీ ఈ భారీ ఎంపిక ప్రక్రియను చేపడుతోంది. అభ్యర్థులు తమ ఫలితాలను యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ లో చూసుకోవచ్చు. వెబ్‌సైట్‌లోని 'రిటన్ రెసుల్ట్' సెక్షన్‌లో ఫలితాల పీడీఎఫ్ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ రోల్ నంబర్ లేదా పేరు ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చు.

- అర్హత సాధించిన వారికి కీలక సూచన

మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ లో అవసరమైన సమాచారాన్ని తప్పనిసరిగా అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని యూపీఎస్సీ స్పష్టం చేసింది. ఇందుకు నవంబర్ 11 నుంచి నవంబర్ 25 సాయంత్రం 6 గంటల వరకు గడువు విధించింది. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి ఇంటర్వ్యూకు సంబంధించిన ఈ-సమన్ లెటర్ జారీలో సమస్యలు తలెత్తవచ్చని హెచ్చరించింది. పర్సనాలిటీ టెస్ట్‌లను న్యూఢిల్లీలోని ధోల్పూర్ హౌస్‌లో ఉన్న యూపీఎస్సీ కార్యాలయంలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ తేదీలను త్వరలో ప్రకటించనున్నారు. అభ్యర్థులకు పోస్టు ద్వారా కాకుండా ఆన్‌లైన్‌లోనే ఈ-సమన్ లెటర్లను అందుబాటులో ఉంచుతారు. ఎంపిక ప్రక్రియ పూర్తయి, తుది ఫలితాలు ప్రకటించిన 15 రోజుల్లోగా అభ్యర్థులందరి మార్క్‌షీట్లను వెబ్‌సైట్‌లో ప్రచురిస్తామని యూపీఎస్సీ తెలిపింది.

పేరు మార్చిన కల్తీ పన్నీర్ కేటుగాళ్లు

అనలాగ్ పన్నీర్‌కు స్వస్తి చెప్పి, మిల్క్ పన్నీర్ పేరుతో కొత్త దందా

- కొత్త స్టిక్కర్లు, కొత్త డెయిరీ పేర్లు, పాత కల్తీ వ్యాపారమే

- గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ విజృంభిస్తున్న కల్తీ పన్నీర్ మాఫియా

- చల్లబడిన టీజీ ఫాస్ట్ అధికారుల దాడులు.?

స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారుల జాడ ఎక్కడ.?



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పన్నీర్ మాఫియా మరోసారి రెచ్చిపోతోందా.? గతంలో అనలాగ్ పన్నీర్ పేరుతో సాగిన అక్రమ వ్యాపారానికి ఇప్పుడు కొత్త ముసుగు తొడిగారా.? పాత పేర్లను పక్కనపెట్టి 'మిల్క్ పన్నీర్' 'మీడియం ఫ్యాట్ పన్నీర్' అంటూ కొత్త స్టిక్కర్లు, కొత్త డెయిరీల పేర్లతో కల్తీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. పేరు మారింది, ప్యాకింగ్ మారింది కానీ పన్నీర్ నాణ్యత, తయారీ విధానంలో మార్పు వచ్చిందా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీర్ తయారీ, నిల్వ, సరఫరాపై తనిఖీలు నిర్వహించి భారీగా నిల్వలను స్వాధీనం చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో సుమారు వెయ్యి కిలోల కల్తీ పన్నీర్ పట్టుబడిన ఘటన కలకలం రేపింది. ఆ సమయంలో టీజీ ఫాస్ట్ అధికారులు హడావుడిగా దాడులు నిర్వహించి కల్తీ వ్యాపారుల గుండెల్లో గుబులు పుట్టించారు. అయితే ఆ దాడుల ప్రభావం ఎన్నాళ్లు కొనసాగింది.? ఇప్పుడు అదే వ్యాపారం కొత్త పేర్లతో మళ్లీ పుంజుకుంటోందనే ఫిర్యాదులు వస్తున్నా అధికారులు ఎందుకు అప్రమత్తం కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్త లేబుల్‌తో పాత దందా

అనలాగ్ పన్నీర్ పేరుతో విక్రయాలు సాగించిన కొందరు వ్యాపారులు ఇప్పుడు మిల్క్ ప్రీమియం పన్నీర్ పేరుతో కొత్త స్టిక్కర్లు అంటించి, కొత్త డెయిరీల పేర్లను ఉపయోగిస్తూ మార్కెట్లోకి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలకు ఈ పన్నీర్ చేరుతున్నట్లు సమాచారం. తక్కువ ధరకు లభిస్తుందనే కారణంతో కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా, చివరకు దాని ప్రభావం సామాన్య వినియోగదారుల ఆరోగ్యంపై పడే ప్రమాదం ఉంది.

అధికారుల దాడులు ఏమయ్యాయి.?

హెచ్ ఫాస్ట్ అధికారులు గతంలో చూపిన దూకుడు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కల్తీ, పాలు పన్నీర్ తయారీ కేంద్రాలు, గోదాములు, ప్యాకింగ్ యూనిట్లు, సరఫరా వాహనాలపై నిరంతర నిఘా ఎందుకు పెట్టడం లేదు.? కొత్త పేర్లతో మార్కెట్లోకి వస్తున్న ఉత్పత్తుల వెనుక ఉన్న తయారీదారులను గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదు.? అన్న అనుమానాలను ప్రజల వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ లో నాణ్యమైన భోజనం చేసే రోజులు ఎప్పుడొస్తాయో అని ఎదురుచూస్తున్నారు.

స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారుల జాడ ఎక్కడ.?

ప్రతి ప్రాంతంలో ఆహార భద్రతను పర్యవేక్షించాల్సిన స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ పన్నీర్ ఎక్కడ తయారవుతోంది.? ఎక్కడ నిల్వ చేస్తున్నారు.? ఏ డెయిరీ పేరుతో విక్రయిస్తున్నారు.? సరఫరా చేస్తున్న వ్యాపారులు ఎవరు.? అనే విషయాలపై అధికారులకు ముందస్తు సమాచారం ఉందని కొంతమంది వ్యాపారులు జిహెచ్ఎంసి స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారులతో కుమ్మక్కై తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నడిపిస్తున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులు మామూలు మత్తులో మునిగిపోయి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కల్తీ పన్నీర్ మాఫియాపై అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహించి కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త స్టిక్కర్ల వెనుక దాగిన పాత కేటుగాళ్లను గుర్తించి, నమూనాలను ప్రయోగశాలలకు పంపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే పేరు మార్చుకుంటూ కల్తీ వ్యాపారం చేసే మాఫియాకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ వ్యాపారం చేస్తే కేటుగాళ్లకుప్రజల ఆరోగ్యం కంటే కల్తీ వ్యాపారుల లాభాలే ముఖ్యమా.? టీజీ సేఫ్ అధికారులు ఇప్పటికైనా మేల్కొంటారా.? అన్నది వేచి చూడాలి.

గూగుల్ ఫొటోస్‌లో కీలక మార్పు

- డిలీట్ చేసిన ఫోటోలు 30 రోజులే!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గూగుల్ ఫొటోస్ వినియోగదారులకు కీలక సమాచారం. యాప్‌లో డిలీట్ చేసిన ఫోటోలు, వీడియోలను తిరిగి పొందేందుకు ప్రస్తుతం ఇస్తున్న 60 రోజుల గడువును గూగుల్ 30 రోజులకు తగ్గించనుంది. ఈ కొత్త విధానం డిసెంబర్ 5 నుంచి అమల్లోకి రానుంది. మరోవైపు ఫోటోల్లోని ఈవెంట్ వివరాలను గుర్తించి నేరుగా గూగుల్ క్యాలెండర్‌లో నమోదు చేసే కొత్త ఫీచర్‌ను కూడా తీసుకొచ్చేందుకు సంస్థ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. డిసెంబర్ 5 నుంచి బిన్‌లోకి వెళ్లే కొత్త ఫైళ్లకు మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది. అంతకు ముందే బిన్‌లో ఉన్న ఫోటోలు, వీడియోలకు మాత్రం పాత 60 రోజుల గడువే కొనసాగుతుంది. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత అవి శాశ్వతంగా తొలగిపోతాయి. ఆ తర్వాత బిన్ నుంచి తిరిగి పొందడం సాధ్యం కాదు. కాబట్టి పొరపాటున ఫోటోలు తొలగించినవారు ఆలస్యం చేయకుండా వాటిని రికవర్ చేసుకోవడం మంచిది.మరోవైపు గూగుల్ ఫోటోస్‌లో త్వరలో కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఫోటోల్లో ఉన్న ఈవెంట్ పోస్టర్లు, ప్రకటనలను గుర్తించి వాటిలోని వివరాలతో నేరుగా క్యాలెండర్‌లో ఈవెంట్ నమోదు చేసుకునే సదుపాయాన్ని తీసుకొస్తున్నట్లు ఆండ్రాయిడ్ అథారిటీ కథనం వెల్లడించింది. గూగుల్ ఫోటోస్ 8.0 యాప్ కోడ్‌ను పరిశీలించినప్పుడు 'యాడ్ టు క్యాలెండర్' అనే ఆప్షన్ కనిపించినట్లు తెలిపింది. గూగుల్ ఏఐ ఆధారిత 'ఆస్క్ ఫోటోస్' ఫీచర్ సాయంతో పోస్టర్‌లోని కార్యక్రమం పేరు, తేదీ, సమయం, వివరణను గుర్తించి క్యాలెండర్‌లో నమోదు చేసేలా దీన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం వినియోగదారులు క్యాలెండర్ యాక్సెస్‌కు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఆటోమేటిక్‌గా రూపొందించిన క్యాలెండర్ ఎంట్రీలో అసలు పోస్టర్ ఫొటోకు లింక్ కూడా ఉంటుందని సమాచారం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588